సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
సోమవారం, 30.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 157
పేజీలు: 12 వెల: రూ. 5

# ఐజేయూ అధ్యక్షుడిగా బల్విందర్ జమ్మూ!

## సెక్రటరీ జనరల్‌గా డీ సోమసుందర్

ఐజేయూ ఉపాధ్యక్షుడుగా పై నరేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కే సత్యనారాయణ, నగునూరి శేఖర్

ఏకగ్రీవంగా ఐజేయూ కార్యవర్గ ఎన్నికలు! **03**






# యుద్ధానికి నెల రోజులు

## చమురు మంటలతో అల్లాడుతున్న ప్రపంచం!

- హోర్ముజ్ జలసంధి మూతపడడంతో ఆకాశాన్ని తాకుతున్న ధరలు **10**
- ఇరాన్-అమెరికా ఘర్షణలు గ్లోబల్ ఎకానమీపై భారీ ప్రభావం
- చమురు సంక్షోభంతో ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యులపై వ్యయం భారం
- భారత్ సహా ప్రపంచ దేశాలు ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వంపై ఆందోళన

పశ్చిమాసియా రణక్షేత్రం ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పాలిట 'చమురు మంట'గా మారింది. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణానికి దారితీసిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ప్రారంభమై నెల గడుస్తున్నా యుద్ధ మేఘాలు తొలగకపోగా మరింత కమ్ముకుంటున్నాయి. ప్రపంచ చమురు సరఫరాకు గుండెకాయ వంటి 'హోర్ముజ్ జలసంధి'ని ఇరాన్ దిగ్బంధించడంతో బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 112 డాలర్లకు చేరి అంతర్జాతీయ విపణిని వణికిస్తున్నాయి. ఈ భౌగోళిక రాజకీయ ఉత్కంఠ కేవలం ఇంధన ధరలనే కాకుండా, భారత్ వంటి దేశాల ఆహార భద్రతను, లక్షలాది మంది ప్రవాసుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోంది.



# కొంపముంచిన హరీశ్ వన్నాగం

# సెల్ఫ్ గోల్

## అనుకున్నది ఒకటి.. అయ్యింది మరొకటి

### అసెంబ్లీ సాక్షిగా నిగ్గు తేలిన మైనింగ్ మాఫియా

- మంత్రి పొంగులేటి టార్గెట్‌గా హరీశ్ ప్రయత్నం
- మొత్తం చిట్టా చదివిన సీఎం రేవంత్
- పాత ప్రభుత్వంలోనే మైనింగ్ మాఫియా
- ఎవరెవరు.. ఎక్కడెక్కడో లిస్ట్ చదివిన సీఎం
- హరీశ్ రావు లేవనెత్తిన అంశమే బీఆర్ఎస్ కు షాక్
- మాజీ మంత్రిపై మండిపడుతున్న గులాబీలు
- వ్యాపారాలను సమర్థించుకోలేక తంటాలు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రెండు రోజుల అసెంబ్లీ సమావేశాల్లో మైనింగ్ అంశమే కీలకమైంది. ఈ అంశాన్ని ఏవో ఆధారాలు అంటూ చూపించే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్.. అదే మైనింగ్ మాఫియాలో చిక్కింది. మంత్రి పొంగులేటీని టార్గెట్ చేద్దామని ప్రయత్నిస్తే.. అదే తుపాకీ బీఆర్ఎస్ వైపు తిరిగి.. బుల్లెట్లు దూసుకువచ్చాయి. ఫలితంగా హరీశ్ రావు పెట్టిన చిచ్చు.. గులాబీ దళానికే ముల్లులా గుచ్చుకున్నాయి. శనివారం నుంచి ఆదివారం వరకు అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్ దూకుడుకు కనిపించింది. మంత్రి పొంగులేటి మీద హరీశ్ రావు సంధించిన విమర్శలు.. ఆరోపణలు పదునుగా ఉండడం ఒక ఎత్తు అయితే.. అంతే దూకుడుగా సమాధానం చెప్పే విషయంలో సభలో ఉన్న సీనియర్ మంత్రుల నుంచి మిగిలిన అధికార పార్టీ సభ్యుల వరకు ఎవరూ సరైన రీతిలో రియాక్టు కావడం లేదని బీఆర్ఎస్ సంబురపడింది. కానీ, ఆ సంబురం ఎంతోసేపు నిలబడలేదు. సీఎం రాగానే.. బీఆర్ఎస్ మైనింగ్ మాఫీయాపై ఎదురు దాడి చేశారు. మిగతా 02లో..

# ఆఖరులో అంతర్యుద్ధం

## అసెంబ్లీలో అధికార ప్రతిపక్షాల బిగ్ ఫైట్

- మైనింగ్ పై గళమెత్తిన బీఆర్ఎస్ **02**
- అక్రమాలు వాళ్లవేనన్న కాంగ్రెస్
- నోరు జారిన కౌశిక్.. సారీ చెప్పాలన్న ఎమ్మెల్యేలు
- మంత్రి పొంగులేటీ టార్గెట్ గా సభ సమరం
- చివరి రెండు రోజులు బీఆర్ఎస్ బహిష్కరణ
- రేపు బిల్లులన్నీ ఆమోదించాక అసెంబ్లీ వాయిదా



# బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బీజేపీ దూరమే

## కేంద్రమంత్రి బండి సంజయ్

రేవంత్, కేటీఆర్ ఇద్దరూ ఒక్కటే
ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్ పై చర్యలేవీ?

**03**



# కష్టకాలంలో అండగా నిలిచారు..

## మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ **10**




- గల్ఫ్ ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు
- యుద్ధంలో భారతీయుల రక్షణకు సహకారం అందించిన గల్ఫ్ నాయకత్వం
- యూఏఈ, సౌదీ, ఖతార్, ఒమన్ సహకారం మరువలేనిదని ప్రధాని వ్యాఖ్య
- వేలాది భారతీయుల సురక్షిత తరలింపులో కీలక పాత్ర పోషించిన గల్ఫ్ దేశాలు

# పసుపు పండుగ

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

- మంగళగిరి ఆఫీసులో భారీ జెండా ఆవిష్కరణ **09**
- వేడుకలను లాంఛనంగా ప్రారంభించిన చంద్రబాబు
- ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు
- పాల్గొన్న మంత్రి లోకేష్, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల సంబురాలు




తెలుగుదేశం పార్టీ రాజకీయ ప్రస్థానంలో మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం 'ఎన్టీఆర్ భవన్' పసుపు వర్ణంతో కళకళలాడింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ఆత్మీయత, ఉత్సాహం ఉరకలెత్తిన ఈ కార్యక్రమంలో పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావుకు ఘన నివాళులు అర్పించడమే కాకుండా, నాలుగు దశాబ్దాల ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలు కార్యకర్తల్లో కొత్త జోష్‌ను నింపాయి. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఇతర ముఖ్యనేతలు హాజరయ్యారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలను చంద్రబాబు పేరుపేరునా పలకరించి, వారిలో ఉత్సాహం నింపారు. -ముద్ర డెస్క్ :

# కన్నవారిని కాదంటే జీతం కోత

## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- ఉద్యోగుల్లో బాధ్యత పెంచే దిశగా ప్రభుత్వం కఠిన నిర్ణయం
- ఫిర్యాదు చేస్తే 60 రోజుల్లో విచారణ పూర్తి **09**
- చట్టం పరిధిలోకి ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు సిబ్బంది, ప్రజాప్రతినిధులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు.. వయోవృద్ధుల కమిషన్‌లో అప్పీల్ అవకాశం
- కుటుంబ విలువల పరిరక్షణకు కొత్త చట్టం లక్ష్యం
- కీలక బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

కన్నప్రేమను విస్మరించి, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను భారంగా భావించే వారికి తెలంగాణ ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. 'తెలంగాణ ఉద్యోగుల జవాబుదారీతనం, తల్లిదండ్రుల సహాయ పర్యవేక్షణ బిల్లు-2026'కు అసెంబ్లీ పచ్చజెండా ఊపింది. కేవలం ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా ప్రైవేటు సిబ్బంది, ప్రజాప్రతినిధులను కూడా ఈ చట్టం పరిధిలోకి తేవడం విశేషం.




# నియోజకవర్గాల పెంపు

# కలిసొచ్చేదెవరికి?

## కరీంనగర్‌లో రాజకీయ సమీకరణాలు మార్పు

- సీనియర్ నేతలకు సవాల్.. యువ నేతలకు గోల్డెన్ ఛాన్స్
- పునర్విభజనతో ఓటు బ్యాంకుల సమీకరణం కుదేలు
- కొత్త సీట్లతో పార్టీల వ్యూహాలు మారనున్నాయ్ **06**




# మూసీ మురిపెం

## నది ఒడ్డున మహత్తర మార్పు

- దేశ ఐక్యతకూ నిదర్శనంగా మూసీ
- దక్షిణ కాశీ తరహా డిజైన్లు
- ప్రత్యేకతలతో ఓంకారేశ్వర ఆలయం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
చారిత్రక మూసీ నది ఒడ్డున ఒక మహత్తర మార్పు రూపుదిద్దుకుంటోంది. ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ పర్యావరణాన్ని పునరుద్ధరించడమే కాకుండా, దేశ మత వైవిధ్యాన్ని, ఐక్యతను చాటిచెప్పబోతోంది. మూసీ పునరుజ్జీవనం తర్వాత ఆ నదీ పరివాహక ప్రాంతంలో దేవాలయం, మసీదు, గురుద్వారా, చర్చి వంటి ఆధ్యాత్మిక కేంద్రాలు, ప్రార్థనా స్థలాలు కొలువుంటాయి. మత సహనం, అన్ని వర్గాల ప్రజల సహజీవనం, పరస్పర గౌరవం, ఉమ్మడి వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయని ప్రభుత్వం చెబుతోంది. దక్షిణ కాశీ తరహాలో నదీ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాంత ఆధ్యాత్మిక వారసత్వాన్ని పునరుద్ధరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో మిగతా 02లో..

# గో సంరక్షణకు ప్రణాళికలు

## సీఎం రేవంత్ రెడ్డి



పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు, బృందంతో భేటీ **09**

# తేల్చుకుందాం రా..

- మీ తమ్ముడి అవినీతికి సిద్ధమేతే మా తమ్ముడిపై విచారణకు సిద్ధం
- హౌస్ కమిటీ వద్దు.. సీఐడీ విచారణ వద్దు
- సిట్టింగ్ జడ్జితో విచారణకు వెళ్దాం **03**
- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్



● ఐపీఎల్ 2026

# ముంబైపై దంచికొట్టిన కోల్‌కతా

- రహానే-రఘువంశీ అర్ధశతకాల హవా
- వాంఖడేలో కేకేఆర్ బ్యాటింగ్ బ్లాస్ట్
- ఓపెనర్ల ఫౌండేషన్.. మిడిల్ ఆర్డర్ ఫినిషింగ్
- ముంబైకి భారీ టార్గెట్ సెట్ చేసిన కోల్‌కతా



ముంబైలోని వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్‌లో రహానే, రఘువంశీ అర్ధశతకాలు బాదడంతో కోల్ కతా నైట్ రైడర్స్ భారీ స్కోర్ చేసింది. 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 220 పరుగులు సాధించింది. ఓపెనర్లు రహానే(67), అలెన్(37) తొలి వికెట్‌కు 69 రన్స్ జోడించారు. ఆపై రింకూ సింగ్(33★)తో కలిసి రఘువంశీ(51) స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. గ్రీన్ 18 పరుగులకే ఔట్ అయ్యారు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో శార్దూల్ 3, హార్దిక్ ఒక వికెట్ తీశారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 30.03.2026
www.mudranews.in | @mudranews

2 జనరల్ న్యూస్
GENERAL NEWS



**టీడీపీ స్థాపన:**
తెలుగు చలనచిత్ర దిగ్గజం నందమూరి తారక రామారావు (NTR) గారు "తెలుగువారి ఆత్మగౌరవం" నినాదంతో 1982, మార్చి 29న ఈ పార్టీని స్థాపించారు. ఢిల్లీ పెత్తనానికి వ్యతిరేకంగా తెలుగువారి గళాన్ని వినిపించడమే ఈ పార్టీ ప్రధాన ఉద్దేశ్యం.

# సెల్ఫ్ గోల్

(మొదటి పేజీ తరువాయి)

**కొంప ముంచావు హరీశా..**


నాలుగైదు ఫైళ్లు పట్టుకుని.. ఏదో ప్లాన్ చేసుకొని వచ్చిన హరీశ్ రావు.. అధికారపక్షానికి పగలే చుక్కలు కనిపించేలా మంత్రి పొంగులేటి కుటుంబ మైనింగ్ యవ్వారం మీద ఘాటైన వాదనను వినిపించారు. ఉత్త మాటలు కాదు ఆధారాలు కూడా ఉన్నాయంటూ ఆయన పలు డాక్యుమెంట్లు చూపిస్తూ తన పదునైన వాదనను వినిపించటం మొదలు పెట్టారు. సభలో ఉన్న కాంగ్రెస్ మంత్రులు ఎవరూ కూడా హరీశ్ రావు వాదనకు ధీటుగా కౌంటర్ ఇచ్చేందుకు తెగ ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేని పరిస్థితి. ఇటీవల కాలంలో విపక్ష నేత వాదనకు అధికారపక్షం ఇంతలా తేలిపోవటం.. కళ్ల ముందే విపక్ష అధికృత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న పరిస్థితి. ఇలాంటి వేళ.. మంత్రి పొంగులేటికి తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనట్లుగా కనిపించింది.

**సీఎం ఎంట్రీ.. సీన్ రివర్స్**

దాదాపు గంటన్నరకు పైగా సాగిన ఈ వ్యవహారం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలోకి అడుగు పెట్టిన పది నిమిషాలకు సీన్ మారింది. అప్పటివరకు హరీశ్ రావు వాదనకు తిరుగులేదన్నట్లుగా సాగిన దానికి భిన్నంగా సీఎం రేవంత్ ఎదురుదాడి మొదలైంది. మంత్రి పొంగులేటి ఒక్కరి అంశాన్నే హరీశ్ రావు నమ్ముకొని సభలోకి రావటం.. అందుకు భిన్నంగా సీఎం రేవంత్ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మైనింగ్ వ్యవహారంలో ఎంతమంది గులాబీ నేతల పాత్ర ఉందన్న విషయాన్ని చెప్పేలా తన వాదనను వినిపించారు. అప్పటికప్పుడు బీఆర్ఎస్ కు చెందిన నేతలు.. వారికి ఉన్న మైనింగ్ సంస్థల పేర్లు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి సుపరిచితమయ్యేలా సీఎం తన వాదనను వినిపించారు. అప్పటివరకు దాడి చేయటం హరీశ్ వంతు.. ఆ మాటల దెబ్బలకు కాచుకునే ఆత్మరక్షణ విధానాన్ని కాంగ్రెస్ మంత్రులు అనుసరిస్తే.. సీఎం రేవంత్ పుణ్యమా అని.. ఎదురుదాడి ముఖ్యమంత్రిది అయితే.. ఆత్మరక్షణలోకి హరీశ్ అండ్ కో వెళ్లారు. మంత్రి పొంగులేటి అండ్ ఫ్యామిలీ వాదనకు ప్రతిగా ఈ అంశాన్ని తెర మీదకు తీసుకొచ్చిన హరీశ్ రావు, ఆయన సోదరుడు మొదలు కొని మైనింగ్ శాఖను ఐదేళ్లు నిర్వహించిన కేటీఆర్ మొదలు.. పలువురు నేతల తీరును వారి ఘనకార్యాలు ఎంత భారీగా ఉన్నాయో తెలుసా అధ్యక్షా? అన్నట్లుగా సీఎం రేవంత్ వాదనలతో సీన్ పూర్తిగా మారిపోయింది.

**గులాబీ దళం అంతర్మథనం**

అప్పటివరకు విచారణకు ఆదేశిస్తారా? ఆ ధైర్యం ఉందా? అంటూ విరుచుకుపడుతున్న




హరీశ్ సవాల్ కు అంతే ధీటుగా స్పందించిన సీఎం రేవంత్ బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో అమలు చేసిన మైనింగ్ పాలసీ మొదలు.. వివిధ ఆరోపణలు ఉన్న వారందరిపైనా సీబీసీఐడీ విచారణ చేపడతామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ మాట గులాబీ నేతలకు కొత్త గుబులుగా మారింది. అధికారపక్షానికి దెబ్బేయటమే లక్ష్యంగా మొదలైన హరీశ్ వాదన.. చివరకు తమకే భారీ దెబ్బగా మారటాన్ని గులాబీ నేతలు జీర్ణించుకోలేని పరిస్థితి. ఏదో అనుకుంటే మరేదో చేశావేంటి హరీశా? అంటూ బీఆర్ఎస్ నేతలు గుసగుసలు ఇప్పుడు ఆ పార్టీలో కొత్త చర్చకు తెర తీశాయి. ఇదంతా చూసిన ఒక సీనియర్ బీఆర్ఎస్ నేత తన సన్నిహితులతో చెప్పిన మాటను ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. సీఎం రేవంత్ ను ఎప్పుడైతే మా వాళ్లు తక్కువగా అంచనా వేయటం మానేస్తారో.. అప్పుడు మార్పు వస్తుంది.

**పొంగులేటీ వ్యూహం.. గురి తప్పింది**

మంత్రి పొంగులేటి మైనింగ్ మీద విమర్శలు..ఆరోపణలు చేసిన మాజీమంత్రి హరీశ్ నోటి వెంట మాట రాకుండా చేయటమే కాదు.. చివరకు వాకౌట్ చేసే వరకు వెళ్లిన పరిస్థితికి కారణం.. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలకు సంబంధించి మైనింగ్ వ్యాపారాల చిట్టా విప్పిన సీఎం తీరుతో విషయం మొత్తం మారిపోయింది.

**ఇంతకూ సీఎం రేవంత్ చెప్పిన బీఆర్ఎస్ నేతల మైనింగ్ అంశాల్ని చూస్తే..**

జోగినిపల్లి సంతోష్ రావు సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో ఇసుక మైనింగ్ కు సంబంధించి సంతోష్ రావు.. ఆయన తండ్రి రవీందర్ రావు

గంగుల కమలాకర్ మాజీ మంత్రి గంగుల కమలాకర్ కుటుంబానికి చెందిన శిరీష జియో గ్రానైన్స్, శ్వేత గ్రానైట్ సంస్థల ద్వారా జరిగిన అక్రమాల సంగతేంటి?

వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు చెందిన గాయత్రి గ్రానైట్స్ వ్యవహారం

హరీశ్ సోదరుడు హరీశ్ రావు సోదరుడికి చెందిన మిడ్ వెస్ట్ గ్రానైట్ కంపెనీలోని అక్రమాలు. కేటీఆర్ – హరీశ్ రావు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లలో ఐదేళ్లు చొప్పున మైనింగ్ శాఖను నిర్వహించిన కేటీఆర్, హరీశ్ రావులేన మొత్త అక్రమాలకు బాధ్యులు. నెలకు రూ.వెయ్యి కోట్ల మేర అక్రమ సంపాదన జరిగింది. అంటూ సీఎం ఎదురుదాడి కొనసాగింది.

జోగినిపల్లి రవీందర్ రావు మాజీ ఎంపీ సంతోష్ రావు తండ్రి రవీందర్ రావుకు చెందిన మైనింగ్ అంశాలు

గూడెం మహిపాల్ రెడ్డి పటాన్ చెర్వు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డికి చెందిన మైనింగ్.

**తుపాకీ రివర్స్**

కేసీఆర్ నేరుగా మైనింగ్ అక్రమాలకు పాల్పడలేదనీ.. ఆయన ప్రభుత్వ హయాంలోనే జరిగింది కదా?మరి కేసీఆర్ బాధ్యత వహించాలి కదా? అంటూ సీఎం ప్రశ్నించారు. దీనికి అనూహ్యంగా బీఆర్ఎస్ అక్కడ తప్పించుకోలేని పరిస్థితుల్లో పడింది. బీఆర్ఎస్ కు చెందిన పలువురు అగ్రనేతలు.. వారి కుటుంబ సభ్యులు, బంధువుల ఇసుక దందా, మైనింగ్ అక్రమాల మాటేంటి? అంటూ సీఎం పలు పేర్లు చదివారు.

అందుకే 2014 జూన్ 2 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని మైనింగ్ లీజులు.. అక్రమాలపై సీబీ సీఐడీ విచారణకు జరిపి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో నివేదిక సమర్పిస్తామని సీఎం ప్రకటించారు. మంత్రి పొంగులేటి మైనింగ్ వ్యవహారం కాంగ్రెస్ ప్రభుత్వాన్నిఇరుకున పెడుతుందని భావించిన బీఆర్ఎస్ నేతలు.. చివరకు తమ వద్దకు వచ్చి ఆగటమే కాదు.. అనూహ్య రీతిలో సీబీసీఐడీ విచారణను ఎదుర్కొనాల్సి రావటంతో ఉలిక్కిపడ్డారు. అనూహ్య రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ ప్రదర్శించిన దూకుడు బీఆర్ఎస్ నేతల్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఉరిమి ఉరిమి మంగళం మీద పడినట్లుగా తమ పరిస్థితి తయారైందని బీఆర్ఎస్ నేతలు లోగుట్టుగా తమ వేదనను వ్యక్తం చేయటం గమనార్హం.

### చిట్టా విప్పిన సీఎం

తెలంగాణ ప్రాంతంలో చెప్పినట్టే.. తాటిని తన్నేటోడు ఒకడుంటే.. వాడి తలను తన్నేటోడు మరొకడు ఉంటాడని. ప్రత్యర్థిని అంచనా వేయటం.. అతడి శక్తియుక్తులు.. సామర్థ్యాలపై అవగాహనలోని లెక్కలు ఏ మాత్రం తప్పి నా.. దానికి చెల్లించాల్సిన మూల్యం ఉంటుంది. అందునా.. రాజకీయంలో అయితే మరింత ఎక్కువగా ఉంటుంది. సరిగ్గా.. శనివారం ఇలాంటి అనుభవాన్నే ఎదుర్కొన్నారు బీఆర్ఎస్ నేతలు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెంది న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి సంబంధించిన రాఘవ కన్ స్ట్రక్షన్ తో పాటు.. పొంగులేటి కుటుంబ సభ్యులు మైనింగ్‌కు సంబంధించి బోలెడన్ని ఆరోపణల్ని సంధించారు మాజీ మంత్రి హరీశ్. ఇక్కడే దిద్దుకోలేని తప్పు చేశారు హరీశ్. ఒక వేలి ఎత్తు చూపిస్తే.. మిగిలిన నాలుగు వేళ్లు మనల్ని ప్రశ్నిస్తాయన్న చిన్న లాజిక్ ను హరీశ్ మిస్ అయిన పరిస్థితి. ఇదే విషయాన్ని గుర్తించిన సీఎం రేవంత్ రంగంలోకి దిగటమే కాదు.. హరీశ్ వాదనకు కౌంటర్ అటాక్ మొదలు పెట్టటమేకాదు.. సభలో ఆత్మరక్షణలో పడిన కాంగ్రెస్ మంత్రులకు ఊరట కలిగించటమే కాదు.. ఎవరైతే తమ మీద దాడికి దిగారో సదరు హరీశ్ మీద మాత్రమే కాదు.. గులాబీపార్టీకి చెందిన పలు వురు పెద్ద తలకాయలు సైతం తల పట్టుకునేలా చేశారు సీఎం రేవంత్.

# మూసీ మురిపెం

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా 1,400 సంవత్సరాలకు పైబడిన ఓంకారేశ్వర స్వామి దేవాలయం, వీరభద్ర స్వామి దేవాలయాల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపనలు జరిగాయి. మొత్తం 8 ఎకరాలలో 700 కోట్ల రూపాయలతో వీటిని అభివృద్ధి చేయనుంది.


**చెప్పిందే చేస్తున్నారు..**

సీఎం రేవంత్ దేవాలయాలతో పాటు మూసీ నదీతీరంలో ఓ మసీదు, గురుద్వారా, చర్చి నిర్మాణానికి ఉద్దేశించిన డిజైన్లను ప్రభుత్వం విడుదల చేసింది. అన్ని మతాలకు చెం దిన ప్రజలు హైదరాబాద్ లో కలిసి మెలిసి జీవిస్తోన్నారని, దీనికి ప్రతీకగా ఆయా ప్రార్థన స్థలాలను నిర్మించాలని సంకల్పించింది. నదీతీరాల వెంబడి గొప్ప నాగరికతలు అభివృద్ధి చెందిన విషయాన్ని గుర్తుచేస్తోంది. వాటి తరహాలోనే మూసీ నదీతీరాన్ని ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రంగా మలచాలని భావిస్తోంది. ఈ ప్రాజెక్ట్ ను పర్యవేక్షించడానికి ఇప్పటికే ప్రభుత్వం

**ఎన్నో ప్రత్యేకతలు..**

ఈ ఓంకారేశ్వర దేవాలయ నిర్మాణ పనులను రెండేళ్లలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ శివాలయానికి అనేక ప్రత్యేకతలున్నాయి. ముందు భాగంలో 91 అడుగుల ఎత్తు, 9 అంతస్తుల్లో మహా రాజగోపురం నిర్మిస్తారు. ఆలయ సముదాయం 2 ప్రాకారాలతో, నలుదిక్కుల 8 భారీ రాజ గోపురాలను ప్రతిష్టిస్తారు. కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనలతో ఆలయ నిర్మాణ శైలి ఖరారైంది. ప్రధాన ఆలయ ప్రాంగణంలో లలితామహాత్రిపురసుందరి, వీరభద్ర, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి ఉప ఆలయాలుంటాయి. ప్రధాన గర్భాలయం ఎత్తు 64 అడుగులుగా ఉండనుంది. 44 స్తంభాలతో మహా మండపం నిర్మాణం కానుంది. మూసీ మధ్యలో 108 అడుగుల ఎత్తైన శివుడి విగ్రహం ఏర్పాటు చేస్తారు.

ఓంకారేశ్వర ఆలయ నిర్మాణ పనులకు వీరభద్రస్వామి దేవాలయప్రాంగణంలో మార్చి






మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నది పర్యావరణ పునరుద్ధరణ, వరదల నివారణ, పట్టణ పరివర్తన, సుస్థిర అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిచ్చే క్రమంలో ఈ ప్రాజెక్ట్ ను చేపట్టింది ప్రభుత్వం. దీనికి సంబంధించిన పనులు, ఇతరత్రా అంశాలను సమన్వయం చేయడానికి, ఆదేశాలను అమలు చేయడానికి ఈ కమిటీ తెరమీదికి వచ్చింది. మూసీ నది సమగ్రాభివృద్ధి, పునర్జీవనం, నిర్వహణ లక్ష్యంగా ఉన్నత స్థాయిలో స్పష్టమైన మార్గదర్శకత్వం, అంతర్–విభాగ సమన్వయం చేసుకోవడం, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తుందీ సబ్ కమిటీ. దీనికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి డీ శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఉపసంఘంలో సభ్యులుగా ఉంటారు. మూసీ నది అభివృద్ధి సంస్థ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మ ల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, అలాగే హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్లు అవసరాన్ని బట్టి కమిటీ సమావేశాలకు హాజరు కావాల్సి ఉంటుంది. అవసరమని భావిస్తే ఇతర అధికారులను కూడా సమావేశాలకు పిలవొచ్చు.

**ప్రత్యేకతలతో నిర్మాణాలు**

మూసీ రివర్ ప్రాజెక్టులో భాగంగా మూసీ తీరం గండిపేట – మంచిరేవులలోని చారిత్రక వీ రభద్రస్వామి ప్రాంగణంలో శ్రీ మచిలేశ్వర స్వామి, శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 14 వందల చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయాన్ని.. 8 ఎకరాల్లో దాదాపు రూ. 700 కోట్లతో పునర్నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

28వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

మూసీ నదీ తీరంలో నాలుగు మతాలకు సంబంధించిన ప్రార్థనాలయాలను నిర్మించి.. అభివృద్ధి పనులను మత సామరస్యానికి ప్రతీకగా నిలపాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

మంచిరేవులలోని పురాతన వీరభద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయటంతో పాటు.. చార్మినార్ మక్కా మసీదు ప్రాంతంలో వద్ద భారీ మసీదు, గౌలిగూడ వద్ద గురుద్వారా, ఉప్పల్ నాగోల్ ప్రాంతంలో అద్భుతమైన చర్చి నిర్మాణం చేపట్టనున్నారు.

ఓంకారేశ్వర ఆలయానికి ఓఆర్ఆర్ నుంచి విశాలమైన రోడ్డు మార్గాలను నిర్మించనున్నారు. ఆలయం వద్ద విశాలమైన వెకిహల్ పార్కింగ్ ఏరియా, దిగువనున్న మూసీపై చిన్నపాటి ఆనకట్టను నిర్మించి నీటిని నిల్వ చేయనున్నారు.

నది మధ్యలో నిల్చున్న భంగిమలో ఏర్పాటు చేయబోయే శివుని విగ్రహం చుట్టూ పార్కులను అభివృద్ధి చేస్తారు. బోటింగ్, ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసింది.

ఒకప్పుడు తెలంగాణలో నాగరికతకు జీవనాడిగా ఉన్న మూసీ నది ఉంది. కానీ దశాబ్దాల తరబడి నిర్లక్ష్యంతో పాటు కాలుష్యానికి గురైంది. ఇదే క్రమంలో మూసీ పరివాహక ప్రాంతంలో అనేక నిర్మాణాలు వెలిశాయి. వీటిని పునరుద్ధరించడానికి గతంలో ప్రయత్నాలు జరిగినప్పటికీ.. విఫలమయ్యాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ నదిని అభివృద్ధి చేయాలని బలంగా భావిస్తోంది. గోదావరి జలాలను మూసీలో పారించేలా ప్రణాళికలను సిద్ధం చేసింది. మూసీ రివర్ ఫ్రంట్‌ను ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యకలాపాల కేంద్రంగా మార్చాలని సర్కార్ భావిస్తోంది. పర్యావరణ సమస్యలకు కూడా చెక్ పెట్టాలని.. మూసీ నుంచి వచ్చే కాల్యుష్య బారి నుంచి నల్గొండ జిల్లాను కాపాడాలని చూస్తోంది.

# ఆఖరులో అంత్యరుద్ధం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

అసెంబ్లీ సమావేశాలు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో సభలో కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం జరిగిన సమావేశాలు ప్రత్యేకంగా హాట్ హాట్‌గా సాగాయి. మైనింగ్ వివాదం ప్రధాన అంశంగా మారి, అధికార–ప్రతిపక్షాల మధ్య ఘర్షణాత్మక వాతావరణం ఏర్పడింది. బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం ముందు బైఠాయించి సభా కార్యక్రమాలను అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశపెట్టిన సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదిస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రెండు రోజుల పాటు, అంటే బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇక మాజీ మంత్రి కడియం శ్రీహరి పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అనుచితంగా ప్రవర్తించిన అంశం కూడా సభలో చర్చకు దారితీసింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ఎథిక్స్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని నిర్ణయించారు. అదే విధంగా కమిటీ నివేదిక ఆధారంగా కౌశిక్ రెడ్డిపై తగిన చర్యలు తీసుకుంటామని స్పీకర్ తెలిపారు.

మైనింగ్ వివాదం ఈ ఉద్రిక్తతకు కేంద్రబిందువైంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతోందని బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ వ్యవహారంపై హౌస్ కమిటీ లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. కేటీఆర్ సభలో మాట్లాడుతూ రాష్ట్రానికి వచ్చే మైనింగ్ ఆదాయం నిజంగా ప్రభుత్వ ఖజానాలోకి వెళ్తోందా అనే సందేహాన్ని వ్యక్తం చేస్తూ సమగ్ర సమాధానం కోరారు. మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని, అవసరమైతే ప్రజల్లోకి వెళ్లి ఉద్యమం చేస్తామన్నారు.

దీనికి ప్రతిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మైనింగ్ అంశంపై ఇప్పటికే సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని స్పష్టం చేశారు. 2014 జూన్ 2 నుండి ఇప్పటివరకు జరిగిన అన్ని మైనింగ్ లీజులు, అనుమతులు, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరుగుతుందని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా సరే వదిలిపెట్టబోమని హెచ్చరించారు. అలాగే, మాజీ మంత్రి హరీశ్ రావు కుటుంబ సభ్యులు ధరణి పోర్టల్‌ను ఉపయోగించి మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ పరిధిలో వందల ఎకరాల భూమిని అక్రమంగా బదలాయించుకున్నారని ఆరోపించారు. ఈ అంశంపై హౌస్ కమిటీ వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, హరీశ్ రావు నిజాయితీగా ఉంటే విచారణకు అంగీకరించాలని సవాల్ విసిరారు.

ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలు ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మంత్రి పొంగులేటి కంపెనీ అవినీతిని బయటపెట్టినందుకే తమను లక్ష్యంగా చేసుకుని సస్పెండ్ చేశారని ఆరోపించారు. హరీశ్ రావు, కేటీఆర్ సహా పలువురు నేతలు సభ వెలుపల నిరసనలు చేపట్టి, గన్‌పార్క్ వద్ద ప్రదర్శనలు నిర్వహించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలను ఆధారాలతో బయటపెట్టామని, ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా బీఆర్ఎస్ సభ్యుల తీరును తీవ్రంగా తప్పుపట్టారు. సభా సంప్రదాయాలను ఉల్లంఘిస్తూ పదేపదే కార్యకలాపాలను అడ్డుకోవడం సరికాదని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే విచారణకు ఆదేశించిందని, అయినా కూడా బీఆర్ఎస్ మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

ఇక అక్రమ మైనింగ్‌తో పాటు గత ప్రభుత్వంలో గ్రానైట్ తవ్వకాలలో కూడా భారీ అక్రమాలు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్రకు చెందిన కంపెనీలపై గతంలోనే కేంద్ర సంస్థలు జరిమానాలు విధించాయని, వాటిని వసూలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కాపాడిందని విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ఆ బకాయిలను వసూలు చేయడమే కాకుండా, అన్ని అక్రమాలపై సమగ్ర విచారణ జరుపుతుందని తెలిపారు.

మరోవైపు, బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ చివరి రోజు దాదాపు 7 కీలక బిల్లులు ఆమోదించాల్సి ఉండటంతో, ప్రతిపక్షాన్ని సభలో లేకుండా చేసి బిల్లులను సులభంగా ఆమోదించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే ఆరోపణలున్నాయి. బీఆర్ఎస్ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ విరుద్ధమని విమర్శిస్తోంది.

మొత్తానికి, అసెంబ్లీ సమావేశాల చివరి దశలో మైనింగ్ వివాదం రాజకీయంగా పెద్ద దుమారాన్ని రేపి, అధికార–ప్రతిపక్షాల మధ్య పోరు చోటుచేసుకుంది. పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడి పెంచే సూచనలు కనిపిస్తున్నాయి.

# జర్నలిజం నాలుగో స్తంభం

**ముద్ర, అమరావతి:**

జర్నలిజం ఒక వృత్తి మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచిన బాధ్యతని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) 11వ ప్లీనరీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం దేశం నలుమూలల నుంచి విచ్చేసిన జర్నలిస్టులు, ఎడిటర్లు, మీడియా ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. భారత స్వాతంత్య్ర పోరాటంలో జర్నలిజం కీలక పాత్ర పోషించిదని, గాంధీజీ, తిలక్, నేతాజీ వంటి నాయకులు జర్నలిస్టులుగా పనిచేశారన్నారు. బ్రిటీష్ కాలంలో 'వెర్నాక్యులర్ ప్రెస్ యాక్ట' వంటి ఆంక్షలను ఎదుర్కొన్నప్పటికీ జర్నలిస్టులు నిజం కోసం వెనక్కి తగ్గలేదన్నారు. 1975 ఎమర్జెన్సీ సమయంలో ప్రెస్ స్వేచ్ఛపై వచ్చిన ఆంక్షలకు మీడియా ధైర్యంగా స్పందించిందని, ప్రస్తుతం డిజిటల్ యుగంలో ప్రతి వ్యక్తి సమాచారాన్ని పంచుకునే స్థాయికి చేరుకున్నా, జర్నలిజం బాధ్యత మరింత పెరిగిందన్నారు. వేగం కోసం నిజాన్ని పక్కన పెట్టడం, విభజనాత్మక ప్రచారం, ఆర్థిక అస్థిరత వంటి సవాళ్లు మీడియా రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. ఒక జర్నలిస్టు ఇప్పుడు రిపోర్టర్‌తో పాటు ఎడిటర్, వీడియోగ్రాఫర్, ఫ్యాక్ట్ చెకర్ పాత్రలు కూడా నిర్వర్తించాల్సిన పరిస్థితి ఉందన్నారు. మీడియా మీద నమ్మకం నిలబడటం అత్యంత కీలకమని, నిజమైన సమాచారం, డేటా ఆధారిత జర్నలిజం, వార్త, అభిప్రాయం మధ్య స్పష్టత అవసరమని తెలిపారు. 'బ్రేకింగ్ న్యూస' వంటి పదాలను బాధ్యతతో ఉపయోగించాలని, అధిక వాడకం విలువను తగ్గిస్తుందన్నారు. జర్నలిస్టులకు సరైన వేతనం, భద్రత, ఆరోగ్య సదుపాయాలు, పెన్షన్ వంటి అంశాలు అత్యవసరమని తెలిపారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా జర్నలిస్టులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. ప్రెస్ స్వేచ్ఛ లేకుండా ప్రజాస్వామ్యం నిలబడబోదని, అది కేవలం రూపకల్పన మాత్రమే అవుతుందని తెలిపారు. ప్రతి పట్టణంలో నిజం కోసం నిలబడే జర్నలిస్టు ప్రజాస్వామ్య బలానికి ప్రతీకని, జర్నలిస్టులు కేవలం వార్తలు చెప్పేవారు కాదు సమాజానికి స్వరం, ప్రజల మనసని పేర్కొన్నారు.

**డిజిటల్ రంగంలో మరింత బాధ్యత ఆవశ్యం**
**ప్రెస్ స్వేచ్ఛతోనే ప్రజాస్వామ్యం**
**ఐజేయూ ప్లీనరీలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**
**ప్రజాసమస్యల వెలికితీతలో జర్నలిస్టుల అగ్రభాగం**
**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**

**సమాజాన్ని మార్చే శక్తి జర్నలిజమే**
**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**

సమాజాన్ని మార్చే శక్తి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే శక్తి ఒక్క జర్నలిస్టులకే ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. ఐజేయూ ప్లీనరీలో ఆయన సందేశమిస్తూ, ఎంతో ధైర్యంతో సమాజ రక్షణకు కృషి చేసే జర్నలిస్టులకు ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ప్రజాహితం కోసం నిరంతం కృషి చేసే జర్నలిస్టులకు ప్రజలంతా అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజా సమస్యల్ని వెలికి తీయడంలో జర్నలిస్టులు అగ్ర భాగంలో నిలబడ్డారని పాత్ర ఎంతో విశిష్టమైనదని కొనియాడారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులకు సీపీఐ రాష్ట్ర సమితి తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఎవరి మాటలు వెనుక ఏ వర్గ ప్రయోజనాలు దాగి ఉన్నాయనేదీ, ఏది మంచో, ఏది చెడో అనేదీ జర్నలిస్టు సోదరులు తెలుసుకోవాలని సూచించారు. జర్నలిజం అనేదీ కారు చీకట్లో కాంతి లాంటిదని, జర్నలిస్టులు ఎంతో చైనత్యవంతులని, ప్రజా సమస్యలు వెలికి తీయడంలో అగ్రభాగంలో ఉంటారన్నారు. వృత్తిపరంగా నిరంతరం రాజకీయ, అధికారుల ఒత్తిళ్లకు నలిగిపోతుంటారని అన్నారు. అలాంటి ఒత్తిళ్లలోను ఎక్కడా తలొగ్గకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే తలొగ్గి ఉంటారని చెప్పారు. ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మల్లా పనిచేసేవాళ్లు జర్నలిస్టులు అని, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, దోపిడీ, దురాగతాలను వెలికితీసేందుకు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. ఎంతో బలంగా ప్రజల పక్షాన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఉంటారో, అప్పుడే ప్రజాస్వామ్యం బలంగా తయారవుతుందన్నారు. ఐజేయూ పూర్వపు అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నూతన అధ్యక్షుడు బల్విందర్ సింగ్, సెక్రటరీ జనరల్ సోమసుందర్, కార్యదర్శులు నరేంద్ర రెడ్డి, సుభాష్, బల్బీర్ సింగ్, జయసింగ్ రావత్, ఉపాధ్యక్షులు అమర్ మోహన్ ప్రసాద్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, ఏపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్, ఐజేయూ మాజీ అధ్యక్షులు ఎస్ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్ పాల్గొన్నారు.

**టీడీపీ సంచలన విజయం:**

పార్టీ పెట్టిన కేవలం 9 నెలల కాలంలోనే అధికారాన్ని కైవసం చేసుకుని టీడీపీ అప్పట్లో ఒక రాజకీయ సంచలనం సృష్టించింది. ఇది భారత రాజకీయ చరిత్రలోనే అత్యంత వేగంగా అధికారంలోకి వచ్చిన పార్టీలలో ఒకటిగా రికార్డు సృష్టించింది.



# రెండేళ్లు.. 20 కుంభకోణాలు

- **విచారణకు బీఆరఎస్ఎల్పీ డిమాండ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సభ తర్వాత బీఆర్ఎస్ పలు అంశాలపై ఆరోపణలు చేసింది. రెండున్నరేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన 20 అతి భారీ కుంభకోణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని, హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శాసన సభా పక్షం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసింది. లెక్కకు మించిన కుంభకోణాలు వరుసగా బయటపడుతుండటం మాత్రమే కాకుండా.. స్వయంగా మంత్రులు, ప్రజాప్రతినిధుల ప్రమేయంతో ఈ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయని లేఖలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెలిపారు. రెండున్నరేళ్ల పాలనా వ్యవధిలో ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని పూర్తిగా చెరిపేశారని ఆరోపించారు. ఈ కుంభకోణాల ఫలితంగా వేల కోట్ల రూపాయల ప్రజాధనం కొద్దిమంది చేతుల్లోకి వెళ్లిపోతుండగా.. సామాన్య ప్రజలకు అందాల్సిన సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా దెబ్బతింటోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెలిపారు. అవినీతిని అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే విషయం కుండబద్దలు కొట్టినట్లుగా స్పష్టమైందనన్నారు. ఈ కుంభకోణాల్లో ప్రమేయం ఉన్న వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాధనాన్ని రికవరీ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.

**లేఖలో పేర్కొన్న స్కామ్ ల వివరాలు :**

సివిల్ సప్లై స్కామ్
అమృత్ టెండర్ల స్కామ్
కేఎల్ఎస్ఆర్ స్కామ్
నైనీ కోల్ బ్లాక్ – సింగరేణి స్కామ్
సింగరేణి ఓబీ స్కామ్
సోలార్ పవర్ స్కామ్
ఎన్టీపీసీ థర్మల్ పవర్ స్కామ్
హెచ్సీయూ భూముల స్కామ్
లగచర్ల ల్యాండ్ స్కామ్
కోటి ఎకరాల భూమి నిషేధిత జాబితా స్కామ్
ఎక్సైజ్ మైక్రో బ్రూవరీ స్కామ్
హామ్ రోడ్స్ స్కామ్
టీడీఆర్ స్కామ్
యంగ్ ఇండియా స్కూల్స్ స్కామ్
ఫోర్త్ సిటీ స్కామ్
హిల్ టీపీ స్కామ్
అక్రమ మైనింగ్ స్కామ్
డెక్కన్ సిమెంట్స్ స్కామ్
మంచి రేవుల దేవాదాయ భూముల స్కామ్



# విద్యా కమిషన్ పై సమగ్ర చర్చ అవసరం

- **పీఆర్సీ నివేదిక వెంటనే అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్**

**ముద్ర, అలంపూర్:**

తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ నివేదికపై సమగ్ర చర్చ జరపాలని, విద్యా రంగానికి నష్టం కలిగించే అంశాలను తిరస్కరించి, అభివృద్ధికి దోహదపడే సిఫార్సులను మాత్రమే అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ సంఘాలు, విద్యా నిపుణులతో చర్చించకుండా, అసెంబ్లీలో కూడా చర్చకు పెట్టకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సరైంది కాదని అభిప్రాయపడింది. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో ఆదివారం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లు రెండో పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్నారని, గడువు పొడిగించకుండా వెంటనే నివేదిక తెప్పించి సంఘాలతో చర్చించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, బకాయి ఉన్న నాలుగు విడతల డీఏలను ప్రకటించాలని, ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు రూపొందించాలని, పర్యవేక్షణ అధికారుల పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని, లేకపోతే ఏప్రిల్‌లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ, యుద్ధం తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యుద్ధం కారణంగా ధరలు పెరిగి ద్రవ్యోల్బణం అధికమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అలంపూర్ పట్టణంలో యుద్ధ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. సమావేశ ప్రారంభంలో జాతీయ పతాకాన్ని డి.రమేష్, ఎస్టీఎఫ్ఐ పతాకాన్ని మద్దిలేటి, టీఎస్ యూటీఎఫ్ పతాకాన్ని ఎం.గోపాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్, ఉపాధ్యక్షులు దుర్గా భవాని, రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐజేయూ కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవం



- **ఐజేయూ అధ్యక్షునిగా బల్వీందర్ జమ్మూ!**
- **సెక్రటరీ జనరల్ గా డి. సోమసుందర్**

**ముద్ర, విజయవాడ:**

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ 11 వ ప్లీనరీ ముగింపు సందర్భంగా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఐజేయు అధ్యక్షునిగా బల్వీందర్ సింగ్ జమ్మూ (పంజాబ్), సెక్రటరీ జనరల్ గా డి.సోమసుందర్ (ఆంధ్రప్రదేశ్) గతంలోనే ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వారు ప్లీనరీ వేదికపై ఆదివారం తమ బాధ్యతలు చేపట్టారు. మిగిలిన ఆఫీస్ బేరర్ పోస్టులకు, కార్యవర్గ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ఆదివారం జరిగింది. ఐజేయూ జాతీయ కార్యవర్గం సీనియర్ పాత్రికేయుడు ఎం.ఎ.మాజిద్ ను ఎన్నికల అధికారిగా నియమించింది. ఉదయం 9 గంటల నుండి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యాక ఫలితాలను ఎన్నికల అధికారి ఎం.ఎ. మాజిద్ ప్లీనరీలో ప్రకటించారు.
జాతీయ ఉపాధ్యక్షులుగా అమర్ మోహన్ ప్రసాద్ (బీహార్), వై.నరేందర్ రెడ్డి (తెలంగాణ), జాతీయ కార్యదర్శులుగా నరేంద్ర భరద్వాజ్ (ఉత్తర ప్రదేశ్ ), డి.ఎస్.ఆర్.సుభాష్ (తమిళనాడు), పి.భాస్కర్ రెడ్డి (కర్ణాటక), కోశాధికారిగా బల్బీర్ సింగ్ జందు (పంజాబ్) ఎన్నికయ్యారు. జాతీయ కార్యవర్గ సభ్యులుగా రవీందర్ సింగ్ (ఉత్తర ప్రదేశ్), కే.సత్యనారాయణ (తెలంగాణ), కే.అజిత (తెలంగాణ), నగునూరి శేఖర్ (తెలంగాణ) కూన అజయ్ బాబు, (ఆంధ్ర ప్రదేశ్) ఈ.ఎన్.రాజు (ఆంధ్రప్రదేశ్), కుణాల్ జే.మాత్రే (మహారాష్ట్ర), మోహన్ రాజ్ శ్రీనివాసన్ (తమిళనాడు), బిందూ సింగ్ (పంజాబ్ & చండీఘర్), ఎం.పీ. మహారాజ (పాండిచ్చేరి), సి.ఎం.సాబిర్ అలీ (కేరళమ్), జయశ్రీ భట్టాచార్య (పశ్చిమ బెంగాల్), వినీతా మండల్ హల్దర్ ( ఛత్తీస్‌ఘడ్), శివేంద్ర నారాయణ్ సింగ్ (బీహార్) టి.శ్రీనివాసరావు ( న్యూఢిల్లీ), ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రత్యక్ష పద్ధతిలో గతంలోనే ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ, సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్ ప్లీనరీ వేదికపై ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యవర్గం రెండేళ్లపాటు బాధ్యతల్లో ఉంటుంది.


**ఐజేయూ ఉపాధ్యక్షుడుగా వై.నరేందర్ రెడ్డి**

- **కార్యవర్గ సభ్యులుగా కే సత్యనారాయణ, నగునూరి శేఖర్**


ఐ.జే.యు. అధ్యక్షుడిగా బల్వీందర్ సింగ్


సెక్రటరీ జనరల్ గా డి.సోమసుందర్


ఐజేయూ ఉపాధ్యక్షుడుగా వై నరేందర్ రెడ్డి


జాతీయ కార్యవర్గ సభ్యులుగా కే సత్యనారాయణ


జాతీయ కార్యవర్గ సభ్యులుగా నగునూరి శేఖర్

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గానికి ఆదివారం నాడు జరిగిన ఎన్నికల్లో తెలంగాణ నుంచి నలుగురు ఎన్నికయ్యారు. వై నరేందర్ రెడ్డి ఉపాధ్యక్షుడుగా ఎన్నిక కాగా జాతీయ కార్యవర్గ సభ్యులుగా కే సత్యనారాయణ, నగునూరి శేఖర్, అజిత ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన నరేందర్ రెడ్డి గతంలో మూడు విడతలు కార్యదర్శిగా ఉన్నారు. అంతకు ముందు అయన ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శిగా ఎనిమిదేళ్లు పని చేశారు.
కే సత్యనారాయణ గతంలో మూడు పర్యాయాలు జాతీయ కార్యవర్గ సభ్యునిగాను అంతకుముందు ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శిగాను పనిచేశారు. అలాగే నగునూరి శేఖర్ కూడా గతంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు గాను రెండు పర్యాయాలు టియుడబ్ల్యూజే అధ్యక్షుడుగాను పనిచేశారు. అజిత కూడా గతంలో ఏపీయూడబ్ల్యుజే కార్యవర్గ సభ్యురాలుగా పనిచేశారు.

# ప్రభుత్వం అంటే మంత్రులేనా..?

- **మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. కేవలం మంత్రుల నియోజకవర్గాలకు మాత్రమే బిల్లులు వస్తున్నాయని అన్నారు. ఆదివారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం అంటే మంత్రులు మాత్రమే కాదని సొంత ప్రభుత్వాన్ని విమర్శించారు. తాము నిధుల కోసం మంత్రుల చుట్టూ తిరగాలా? అని సీరియస్ అయ్యారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు.. ప్రభుత్వం ఏం చేసినా ఖమ్మం జిల్లాకే వెళ్తున్నాయని టాక్ ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటున్నట్లు.. తాము మా నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకోకూడదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మునుగోడును అభివృద్ధి చేసుకుందాం అనుకుంటే ఎవరూ సహకరించడం లేదని మండిపడ్డారు. మరోవైపు.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం ఎత్తిపోతల పథకాలను హుజూర్‌నగర్‌కు తరలించుకుపోతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తోందన్న రాజగోపాల్ రెడ్డి.. నిర్ణయాలు, క్రమశిక్షణలో కరెక్ట్‌గా ఉందన్నారు. అయితే నియోజకవర్గాలకు కూడా నిధులు ఇవ్వాలని కోరారు.





# ఆదర్శంగా నిలవాలి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణను హరిత శక్తి సామర్థ్య రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మోడల్ సోలార్ విలేజ్' కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. ఆదివారం అసెంబ్లీ హాల్లో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన వ్యక్తిగతంగా లేఖలు అందజేశారు. ప్రతి ప్రజాప్రతినిధి తన సొంత గృహంలో 2కి.వా గ్రిడ్‌కనెక్టెడ్ సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో సౌర విద్యుత్ పట్ల అవగాహన కల్పించాలంటే ముందుగా నాయకులే ఆదర్శంగా నిలవాలన్న ఆయన తద్వారా నివాస ప్రాంతాలను విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చవచ్చని ఆకాంక్షించారు. ఈ విధానంతో గృహ విద్యుత్ ఖర్చులు తగ్గడమే కాకుండా, రాష్ట్ర హరిత శక్తి గ్రిడ్‌కు గణనీయమైన సహకారం అందుతుందని వివరించారు. ఆసక్తి గల ప్రజాప్రతినిధులు తమ నివాస చిరునామా, తాజా విద్యుత్ బిల్లు ప్రతులను ఖైరతాబాద్‌లోని టీజీ రెడ్ కో కార్యాలయంలో అందజేయాలని కోరారు. వీటి ఆధారంగా సాంకేతిక బృందం సర్వే నిర్వహించి ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను పూర్తి చేస్తుందని తెలిపారు.

# రేవంత్, కేటీఆర్ ఇద్దరూ ఒక్కటే

- **బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బీజేపీ ఎప్పుడూ దూరమే**
- **కేంద్రమంత్రి బండి సంజయ్**

**ముద్ర, కరీంనగర్ :**

ఫార్ములా ఈరేసు కేసులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేతలు.. ఇప్పటివరకు కేటీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం కారణంగానే చర్యలు తీసుకోవడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ బీజేపీ పొత్తు ఎప్పటికీ జరగదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బీజేపీ ఎప్పుడూ దూరమే అని వెల్లడించారు. దాంతోపాటు వారసత్వ, కుటుంబ రాజకీయాలకు కూడా బీజేపీ దూరమే అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డిప్రెషన్‌లో ఉండి డీలిమిటేషన్‌పై మాట్లాడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరును తప్పుబట్టిన బండి సంజయ్ చట్ట సభల్లో సభ్యులు గౌరవంగా నడుచుకోవాలని హితవు పలికారు. పదిమందికి ఆదర్శంగా ఉండాల్సిన ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఇలా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని చెప్పారు. రాష్ట్రంలో అసెంబ్లీ కమిటీ లేదు.. ఎథిక్స్ కమిటీ లేదు.. లేని కమిటీకి కౌశిక్ రెడ్డి అంశాన్ని రికమండ్ చేయడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



# తేల్చుకుందాం రా...

- **మీ తమ్ముడి అవినీతికి సిద్ధమైతే.. మా తమ్ముడిపై విచారణకు సిద్ధం**
- **సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



తన తమ్ముడు చేసిన అవినీతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హౌస్ కమిటీ విచారణకు సిద్ధమైతే తానూ తన తమ్ముడిపై హౌస్ కమిటీ విచారణకు సిద్ధం అని బీఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు రేవంత్ రెడ్డికి సవాల్ చేశారు. హౌస్ కమిటీ వద్దు.. సీఐడీ విచారణ వద్దు.. ఇద్దరం కలిసి సిట్టింగ్ జడ్జితో విచారణకు వెళ్దామన్నారు. ఈ విషయంలో విచారణకు రేవంత్ రెడ్డికి దమ్ముందా అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీ అవినీతి కి పాల్పడిందని అందరికీ అర్థం అయిందని హరీశ్ రావు చెప్పారు. అందుకే ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిందని చెప్పారు. అందుకే ముఖ్యమంత్రి ఎదురు దాడి చేస్తోందన్నారని ఆరోపించారు. సమాధానం లేదు కాబట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వంలో అవినీతిని కౌశిక్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు కాబట్టే ఆయన్ను బెదిరిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో నోటితో చెప్పలేని భాష మాట్లాడిన రేవంత్ రెడ్డిని ఎథిక్స్ కమిటీ ముందు నిలబెట్టాలన్నారు. మంత్రి తప్పు చేశారని అందరికీ అర్థం అయిందన్నారు. మైనింగ్‌లో అవినీతిపై సీబీ సీఐడి కాదు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలంటున్నామని హరీశ్ రావు అన్నారు. పొంగులేటి మంత్రిగా ఉంటే విచారణ సజావుగా సాగదన్న హరీశ్ రావు... అందుకే ఆయన్ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్ అధికారులు మంత్రి పొంగులేటికి రూ. 28 లక్షల జరిమానా విధించారని చెప్పారు. కానీ ఆయన ఆ పెనాల్టీ కట్టలేదన్నారు. కనీసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చర్యలు తీసుకోలేదన్నారు. 20 అంశాలపై విచారణ చేయించాలని స్పీకర్‌కు లేఖ ఇచ్చామనీ వీటిపైన సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలన్నారు. మైక్ కోసం నాలుగున్నర గంటల పాటు నిలబడ్డాము అయినా మైక్ ఇవ్వలేదని హరీశ్ అన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 30.03.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

వంగవీటి అభిమానులకు

## త్వరలో తీపి కబురు..!



వంగవీటి రాధాకృష్ణ ప్రత్యేక పరిస్థితుల్లోనే తెలుగుదేశం పార్టీలో చేరారు. అదే పార్టీలో కొనసాగుతున్నారు. అయితే ఇంతవరకు ఆయనకు కూటమిలో పదవి దక్కకపోవడంతో రకరకాల ప్రచారం నడుస్తోంది. వంగవీటి ఫ్యామిలీ విషయంలో చంద్రబాబుకు భిన్న వైఖరి ఉండడం వల్లే నిర్ణయం తీసుకోలేదని పొలిటికల్ వర్గాల్లో టాక్ ఉంది. కానీ ఇప్పుడు వంగవీటి రాధాకృష్ణ విషయంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి చంద్రబాబుది.

వంగవీటి మోహన్ రంగా మరణం చుట్టూ అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. కులం కోణంలో పార్టీ కోణంలో తెలుగుదేశం పార్టీ చుట్టూ అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే కాంగ్రెస్ సైతం ఈ విషయంలో ఆ కుటుంబానికి న్యాయం చేయలేకపోయింది. చివరకు వంగవీటి మోహన్ రంగా కుమారుడు రాధాకృష్ణ అదే తెలుగుదేశం పార్టీలో చేరాల్సి వచ్చింది. తెలుగుదేశం పార్టీలో ఉండి రంగా హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవినేని ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంది. అయితే రాజకీయాల్లో ఇటువంటి భిన్న వైఖరి కొనసాగుతున్న క్రమంలో.. వంగవీటి రాధాకృష్ణ విషయంలో చంద్రబాబు ప్రత్యేక ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. పార్టీ కష్టకాలంలో ఉండగా వచ్చి ప్రచారం చేయడంతో పాటు ఐదేళ్ల పాటు పార్టీలో కొనసాగుతూ వచ్చారు రాధాకృష్ణ. అందుకే ఆయనకు ఏదో ఒక అవకాశం ఇవ్వాలని చంద్రబాబుతో పాటు లోకేష్ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

వంగవీటి మోహన్ రంగా హత్య సమయంలో రాధాకృష్ణ ది చిన్న వయసు. అయితే 2003లో రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర సమయంలో యువకుడిగా ఉన్న రాధాకృష్ణను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన రాధాకృష్ణ చిన్న వయసులోనే అసెంబ్లీలో అడుగు పెట్టారు. అటు తరువాత రాధాకృష్ణ రాజకీయ అపసవ్య నిర్ణయాలు తీసుకున్నారు. దాని ప్రతికూలతలు ఎదుర్కొన్నారు. ప్రజారాజ్యం పార్టీ తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. 2009, 2014లో పోటీ చేసి ఓడిపోయారు. 2019, 2024 ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కలేదు. అయితే వంగవీటి రాధాకృష్ణ కు ఛాన్స్ ఇవ్వాలని చంద్రబాబుతో పాటు లోకేష్ నిర్ణయం తీసుకున్నారట. ఎమ్మెల్సీ ఇవ్వడమే కాకుండా మంత్రివర్గంలోకి తీసుకోవాలని భావిస్తున్నారట. త్వరలో ఖాళీ కాబోయే ఎమ్మెల్సీ పోస్టులో ఒకటి రాధాకృష్ణకు ఇవ్వడం ఖాయంగా తెలుస్తోంది. విస్తరణలో క్యాబినెట్ లో కూడా ఛాన్స్ ఇస్తారని సమాచారం.

– కనపర్తి రవి

# అల్పాహారానికి రారాజు ఇడ్లీ

### మార్చి 30 ప్రపంచ ఇడ్లీ దినోత్సవం

పిల్లల నుండి వృద్దుల దాకా ఆరోగ్యంగా ఉన్నవారి నుండి పేషంట్ల వరకు అందరూ ప్రతి రోజూ ఉదయం తినే టిఫిన్‌లో ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే అల్పాహారం ఇడ్లీనే. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రాచుర్యం పొందిన అల్పాహారం.అందుకు కారణం అది తేలికపాటి ఆహారం.ఇది రుచికరమైనదే కాకుండా, ఆరోగ్యవంతమైన ఆహారం. ఇడ్లీ తినడం ద్వారా త్వరగా జీర్ణం అవడమే కాకుండా మనిషిని ఆరోగ్యంగా ఉంచడానికి తోడ్పడుతుంది.

### పోషకాల గని:

ఇడ్లీ ఆరోగ్యకరమైన అల్పాహారం. మధ్యరకం సైజు ఇడ్లీ నుండి సుమారు 50 క్యాలరీలు లభిస్తాయి. ఇందులో 0.2 గ్రా కొవ్వులు, 1.43 గ్రా మాంసకృతులు, 11.48 గ్రా పిండి పదార్థాలు, 1.1 గ్రా పీచు పదార్థాలు, 279 మి.గ్రా సోడియం, 9 మి.గ్రా పొటాషియం, 1 మి.గ్రా ఇనుము లభిస్తాయి. ఇందులో రోజువారీ పనులకు అవసరమయ్యే పోషకాలన్నీ దాదాపుగా లభిస్తాయి.

### ఇడ్లీకీ ఒక రోజుందండోయ్:

ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఇడ్లీకి ఒక ప్రత్యేకమైన రోజు ఒకటి ఉందని ఎంతమందికి తెలుసు? అవునండీ.. మదర్స్ డే, ఫాదర్స్ డే, ఎర్త్ డే అలా అన్నింటికీ ప్రత్యేకమైన రోజు ఉన్నట్లుగానే ఇడ్లీకి కూడా ఒక ప్రత్యేకమైన రోజు ఉంది. మార్చి 30 వ తేదీని ఇడ్లీ రోజుగా పాటిస్తారు. 2015లో చెన్నైకి చెందిన ఇడ్లీ క్యాటరర్ ఎనియావన్ దీనిని గుర్తించారు. ఆయన దాదాపు 1,328 రకాల ఇడ్లీలను తయారు చేశారు. అదే రోజు ఒక 44 కిలోల పెద్ద ఇడ్లీని తయారు చేసి ఇడ్లిపై తనకున్న ఇష్టాన్ని చాటి చెప్పాడు. ఒక ప్రభుత్వ ఉద్యోగి ఈ భారీ ఇడ్లిని కట్ చేసాడు అప్పటి నుండి మార్చి 30ని ప్రపంచ ఇడ్లీ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించడం జరిగింది.

### అల్పాహారంలో నెం.1:

ఇడ్లిని భారతీయులందరు అల్పాహారంలో ఎంతో ఇష్టంగా తింటారు. దీనికి దేశ వ్యాప్తంగా ఏంతో ప్రాముఖ్యత వుంది. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ఇడ్లిని మొదటగా తయారు చేసింది భారతీయులు కాదు. ఇడ్లీకి మూలం ఇండోనేషియా దేశం అని చరిత్రకారులు చెప్తున్నారు. ఈ వంటకం 800 నుండి 1200 నాటి కాలంలో భారతదేశానికి వచ్చిందని భావిస్తున్నారు.

ఇడ్లీలు తక్కువ కేలరీలు ఉంటాయి కాబట్టి వీటిని ఆహారంలో స్వీకరించడం ద్వారా బరువు తగ్గే అవకాశం ఉంటుంది. ఇది తేలికపాటి వంటకం. దీంతోపాటు ఇందులో ప్రొటీన్లు, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల పొట్ట



ఎక్కువసేపు నిండుగా ఉండేలా చేస్తుంది. ఇడ్లీల ద్వారా ఆరోగ్యానికి మంచి ప్రోటీన్లు లభిస్తాయి. దీంతోపాటు శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు అందడంతోపాటు మెరుగైన శోషణకు అవకాశం ఉంటుంది.

### ఆరోగ్యప్రదాయిని ఇడ్లీ

ఇడ్లీలు ఆహారంలో తీసుకోవడం ద్వారా మెరుగైన జీర్ణక్రియకు తోడ్పడుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కిణ్వ ప్రక్రియ కారణంగా ఇడ్లీలు ప్రోబయోటిక్స్ ద్వారా కొన్ని సూక్ష్మజీవులను నియంత్రిస్తాయని వైద్య ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇడ్లి ఆకలిని తీర్చడమే కాకూండా శక్తి కోసం కార్బోహైడ్రేట్లను, పెరుగుదలకు ప్రోటీన్ ఇస్తుంది. ఇందులోని మంచి బాక్టీరియా చాలా విటమిన్ బిని ఉత్పత్తి చేస్తుంది.

ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇడ్లీని రోజూ తినే వ్యక్తికి తల నొప్పి రాకపోవచ్చు, ఎందుకంటే నల్ల శనగలో తల నొప్పిని నిరోధించే గుణం ఉంది. దీనితో పాటు ఉపయోగించే సాంబార్ అనేది అనేక కూరగాయలు, మసాలాలు, చింతపండు, ఇంగువ మొదలైన వాటిని కలిగి ఉండే పోషకమైన కూరగాయల పులుసులో ఒకటి. ఇది కడుపుని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆమ్లత్వం, అజీర్ణాన్ని నివారిస్తుంది.

### ఇడ్లీ పుట్టుపూర్వోత్తరాలు:

దోశకు, వడకు తమిళ దేశాన రెండు వేల సంవత్సరాల ఘనమైన చరిత్ర కలదు కానీ, ఇడ్లీ మాత్రము విదేశీ దిగుమతి. సాహిత్యములో తొలిసారి ఇడ్లీ వంటి వంటకము యొక్క ప్రస్తావన (ఇడ్డలిగే) 920లో శివకోట్యాచార్య యొక్క "వడ్డారాధనే" అనే కన్నడ రచనలో ఉంది. ఆ తరువాత 1130లో కళ్యాణీ చాళుక్య చక్రవర్తి మూడవ సోమేశ్వరుడు రచించిన సంస్కృత విజ్ఞాన సర్వస్వము మానసోల్లాసలో ఇడ్లీ తయారు చేసే విధానము ఇవ్వబడింది. అయితే ఈ రచనలలో ఆధునిక ఇడ్లీ తయారీకి ప్రధాన భాగలైన మినపప్పుతో పాటు బియ్యపుపిండి కలపడము, పిండిని పులియబెట్టడము, పిండి పొంగడానికి ఆవిరిపట్టడము మొదలైన విషయాల గురించిన ప్రస్తావన లేదు.కంచి దేవరాజ స్వామి ఆలయంలో ఒకటిన్నర కిలో బరువున్న ఇడ్లీ తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. ఇందుకోసం బియ్యం, మిరియాలు, కొత్తిమీర, అల్లం, ఇంగువ, జీలకర్ర, తగినంత పెరుగు కలిపి మెత్తగా రుబ్బి ఓ పెద్ద ఇడ్లీగా వేసి ఆవిరి మీద ఉడికిస్తారు.కేరళలోని పాలక్కాడ్ జిల్లాలోని రామస్సెరి అనే గ్రామం ఇడ్లీలకు పెట్టింది పేరు. స్పాంజిలా మృదువుగా ఉండే ఈ ఇడ్లీ ఒకటో శతాబ్దం నుంచీ ఒక కుటుంబం ఈ విధానాన్ని రహస్యంగా ఉంచుతున్నారు. ఇప్పటికీ కట్టెలపొయ్య మీద బట్ట కట్టిన మట్టి పాత్రలోనే ఇడ్లీని వండుతారు.

ఏది ఏమైనా ప్రస్తుతం ఇడ్లీ తన రూపురేఖలను మార్చుకుందనడంలో సందేహం లేదు .పిల్లల నుండి పెద్దల వరకు రకరకాల ఇడ్లీలను రుచి చూస్తున్నారు. రాగి ఇడ్లీ,క్యారెట్ ఇడ్లీ ,చిరు ధాన్యలతో ఇడ్లీలు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. ఇప్పుడే కాదు ఎప్పటికీ చాలామందికి ఎవర్ గ్రీన్ బ్రేక్ ఫాస్ట్ ఇడ్లీ నే ఉంటుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

- సుధాకర్.ఏ.వి

– రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
– స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
– 9000674747

# తెలుగు తేజం.. జాతీయ గమనం

### 'IE 100' జాబితాలో తెలుగు నేతల ధీమా!

భారతదేశ రాజకీయ యవనికపై తెలుగు రాష్ట్రాల ముద్ర ఎప్పుడూ విలక్షణమైనదే. అయితే ఇటీవల కాలంలో ప్రాంతీయ పార్టీల ప్రాభవం పెరగడం, కేంద్రంలో సంకీర్ణ రాజకీయాల అవసరం ఏర్పడటంతో తెలుగు నేతల ప్రాధాన్యత ఊహించని స్థాయికి చేరుకుంది. దీనిని అద్దం పడుతూ, ప్రముఖ జాతీయ దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విడుదల చేసిన 'IE 100: 2026' అత్యంత శక్తిమంతమైన భారతీయుల జాబితా ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దేశ భవిష్యత్తును, విధాన నిర్ణయాలను ప్రభావితం చేయగల 100 మంది ప్రముఖులలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నాయకులు అగ్రస్థానాల్లో నిలవడం, మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనం.

### చంద్రబాబు: సంకీర్ణ యుగపు ధ్రువతార (ర్యాంక్: 13)

ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 13వ స్థానంలో నిలవడం వెనుక దశాబ్దాల రాజకీయ అనుభవం , ప్రస్తుత రాజకీయ అనివార్యత ఉంది.

కింగ్ మేకర్ పాత్ర: కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటులో తెలుగుదేశం పార్టీ పోషించిన కీలక పాత్ర చంద్రబాబును మళ్ళీ జాతీయ రాజకీయాల్లో ప్రధాన ఆకర్షణగా నిలబెట్టింది.

రాష్ట్ర పునర్నిర్మాణం: విభజన గాయాల నుంచి ఆంధ్రప్రదేశ్‌ను గట్టెక్కించే క్రమంలో అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి చేయడం వంటి లక్ష్యాలతో ఆయన చూపుతున్న చొరవ జాతీయ స్థాయి ప్రశంసలు పొందుతోంది.

దార్శనికత: కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చడంలో ఆయనకున్న 'బ్రాండ్ ఇమేజ్' ఈ గుర్తింపుకు ప్రధాన కారణం. అత్యంత శక్తిమంతమైన తెలుగు నాయకుడిగా ఆయన తన ఆధిపత్యాన్ని ఈ జాబితా ద్వారా మరోసారి చాటిచెప్పారు.



### రేవంత్ రెడ్డి: కాంగ్రెస్ ఆశల వారధి (ర్యాంక్: 25)

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ జాబితాలో 25వ స్థానాన్ని కైవసం చేసుకోవడం ఒక సంచలనం.

పార్టీలో ఎదుగుదల: కాంగ్రెస్ అధిష్టానం వద్ద రేవంత్ రెడ్డికి ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. రాహుల్ గాంధీ తర్వాత పార్టీలో అత్యంత ప్రభావశీలుడైన నేతగా ఆయనను ఈ నివేదిక అభివర్ణించడం గమనార్హం.

సీనియర్లను మించి: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వంటి ఉద్దండులను వెనక్కి నెట్టి ఆయన ఈ స్థానాన్ని దక్కించుకోవడం, ఆయన నాయకత్వ పటిమకు, వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే తీరుకు నిదర్శనం.

దక్షిణాది వాయిస్: దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డి ఒక బలమైన కవచంలా, దూకుడున్న గళంలా అవతరించారు. పార్టీకి నిధుల సేకరణలోనైనా, కేడర్‌ను ఉత్సాహపరచడంలోనైనా ఆయన శైలి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

### పవన్ కళ్యాణ్: ప్రభంజనం నుంచి పరిణతి వైపు (ర్యాంక్: 68)

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ 68వ స్థానంలో నిలిచి తన రాజకీయ బలాన్ని నిరూపించుకున్నారు.

ఓట్ల బదిలీ శక్తి: కేవలం సినిమా గ్లామర్ మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో ఓట్లను ప్రభావితం చేయగల, మిత్రధర్మాన్ని పాటించే నమ్మకమైన నేతగా ఆయన ఎదిగారు.

విధాన నిర్ణయాలు: ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంటూ, అభివృద్ధి మరియు ప్రజా సమస్యల మధ్య సమతుల్యత పాటిస్తున్న తీరు ఆయనను జాతీయ స్థాయి నాయకుడిగా నిలబెట్టింది.

### రామ్ మోహన్ నాయుడు: యువ నాయకత్వపు ముద్ర (ర్యాంక్: 90)

కేంద్ర మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు 90వ స్థానంలో నిలవడం, తెలుగు రాష్ట్రాల నుంచి ఎదుగుతున్న యువ నాయకత్వానికి దక్కిన గొప్ప గౌరవం.

పనితీరు: కేంద్ర క్యాబినెట్‌లో అత్యంత పిన్న వయస్కుడైన మంత్రిగా, పౌర విమానయాన శాఖ వంటి కీలక రంగాల్లో ఆయన చూపిస్తున్న చొరవ, పార్లమెంటులో ఆయన ప్రసంగాలు జాతీయ స్థాయిలో అందరినీ ఆకర్షించాయి.

### అస్తమిస్తున్న తారలు: వైసీపీ, బీఆర్ఎస్ గైర్హాజరీ

ఈ జాబితాలో అత్యంత చర్చనీయాంశమైన విషయం కేసీఆర్ మరియు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్లు లేకపోవడం.

ప్రభావం క్షీణత: ఒకప్పుడు జాతీయ స్థాయిలో చర్చల్లో నిలిచిన వీరు, ఇప్పుడు టాప్ 100లో చోటు దక్కించుకోలేకపోవడం వారి రాజకీయ పలుకుబడి భారీగా తగ్గిపోవడానికి సంకేతం.

అధికార పవనాలు: అధికారం కోల్పోయిన తర్వాత జాతీయ స్థాయిలో వారి వాయిస్ నామమాత్రంగా మారిందని ఈ నివేదిక విశ్లేషించింది. ప్రస్తుతం తెలుగు రాజకీయాల కేంద్రబిందువు కూటమి ప్రభుత్వం మరియు రేవంత్ రెడ్డి వైపు మళ్లిందని స్పష్టమవుతోంది.

మొత్తంగా చూస్తే, 'IE 100: 2026' జాబితా తెలుగు నేతల ఎదుగుదలను మాత్రమే కాకుండా, దేశ రాజకీయాల్లో తెలుగు రాష్ట్రాల ప్రాముఖ్యతను పట్టిచూపుతోంది. చంద్రబాబు అనుభవం, రేవంత్ రెడ్డి దూకుడు, పవన్ కళ్యాణ్ నిబద్ధత, రామ్ మోహన్ నాయుడు చొరవ.. ఇవన్నీ కలిసి జాతీయ యవనికపై 'తెలుగు వెలుగు'ను నింపుతున్నాయి.

– నరేష్, ముద్ర

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 30.03.2026
www.mudranews.in | @mudranews



**టీడీపీ ప్రధాన ప్రతిపక్షం:**



1984 లోక్‌సభ ఎన్నికల్లో 30 సీట్లు గెలుచుకోవడం ద్వారా, భారత పార్లమెంటు చరిత్రలో ప్రధాన ప్రతిపక్ష హోదా పొందిన మొట్టమొదటి ప్రాంతీయ పార్టీగా టీడీపీ నిలిచింది.

# కమర్షియల్ గ్యాస్ కొరత

ప్రస్తుతం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత చిన్న వ్యాపారాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. ముఖ్యంగా హోటళ్లు, టిఫిన్ బండ్లు, స్వీట్ హౌస్‌లు, మిర్చి బండ్ల వ్యాపారులు గ్యాస్ అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. గ్యాస్ కొరతతో చాలాచోట్ల షాపులు తాత్కాలికంగా మూతపడుతున్నాయి.

- ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్

– కుదేలవుతున్న హోటళ్లు, టిఫిన్ బండ్లు, స్వీట్ హౌస్ వ్యాపారాలు – ఉపాధి కోల్పోతున్న కార్మికులు

యుద్ధం ప్రభావం తో కమర్సియల్ గ్యాస్ కొరతే ఏర్పడింది. రోజువారీ ఆదాయంపై ఆధారపడే చిన్న వ్యాపారులు ఈ పరిస్థితితో తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొం టున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేసే టిఫిన్ బండ్లు, చాట్ సెంటర్లు గ్యాస్ లేక పనులు నిలిపివేయాల్సి రావడంతో, అక్కడ పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. రోజుకు వచ్చే ఆదాయం లేకపోవడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇక షాపుల యజమానుల పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. వ్యాపారం కోసం తీసుకున్న




అప్పులు, షాప్ అద్దెలు, విద్యుత్ బిల్లులు చెల్లించలేక తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో ఆదాయం లేక అప్పులు పెరుగుతున్నాయి. కొంతమంది యజమానులు అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ కొనుగోలు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. అయితే అది కూడా అందరికీ సాధ్యం కాకపోవడంతో చాలామంది షాపులను మూసివేయడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. ఈ పరిస్థితిపై వ్యాపారులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే కమర్షియల్ గ్యాస్ సరఫరాను పునరుద్ధరించి, చిన్న వ్యాపారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఈ సంక్షోభం తీవ్రమై వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ అధికార ప్రతినిధి, అడక్ కమిటీ మెంబర్ రమేష్ కొప్పుల ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. తదుపరి నందమూరి తారక రామారావు చిత్ర పటానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు భారీగా పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ముద్ర కూకట్‌పల్లి:**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాము నిరంతరం శ్రమిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ స్పష్టం చేశారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శివయ్య బస్తీలో స్థానిక నాయకులు లక్ష్మణ్ గౌడ్, నరసింహా యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలోపర్యటించి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్థానికులు పలు ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు బోరబండ రైల్వే స్టేషన్ పరిసరాల్లో రౌడీ మూకలు, సంఘ విద్రోహ శక్తులు గంజాయి, మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, దీనివల్ల మహిళలు, పిల్లలు బయటకు రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీలో చెత్త తరలింపు సక్రమంగా జరగడం లేదని వ్యర్థాలతో దుర్వాసన వ్యాపించి రోగాల బారిన పడుతున్నామని ఫిర్యాదు చేశారు. పోలీస్, రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను వివరించి పరిస్కరించాలని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య,, కొప్పిశెట్టి దినేష్, బర్కత్ ఆలీ, నరసింహ, మన్సూర్, సఫీ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## సలేశ్వరం జాతర ప్రత్యేక బస్సులు



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన సలేశ్వరం జాతరకు ఆర్టీసీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఏప్రిల్ 1 నుంచి 3 వరకు జరిగే ఈ జాతరకు భక్తుల రాకపోకలు సౌకర్యవంతంగా ఉండేందుకు నాగర్ కర్నూల్ ఆర్టీసీ డిపో నుంచి 25 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. పౌర్ణమి సందర్భంగా ఏప్రిల్ 2న భారీగా భక్తులు తరలి వచ్చే అవకాశమున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఈ ఏడాది సుమారు 15,000 మంది భక్తులు జాతరకు హాజరవుతారని అంచనా వేస్తుండగా, గత సంవత్సరం సుమారు 12,000 మంది భక్తులు పాల్గొన్నట్లు వెల్లడించారు.రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి నల్లమల్ల అటవీ ప్రాంతంలోని గుహలో వెలసిన స్వయంభూ సలేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అచ్చంపేట మండలం మన్ననూరు నుంచి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పవిత్ర క్షేత్రానికి చేరుకునేందుకు భక్తులు ప్రత్యేక ఏర్పాట్లను వినియోగించుకోవాలని సూచించారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాతరకు సంబంధించిన కరపత్రాలను డిపో మేనేజర్ ఆకారపు యాదయ్య విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు జోగమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళిక బద్ధంగా ఉప్పల్ అభివృద్ధి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని కాలనీలను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు,మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ భవనాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి వెల్ఫేర్ అసోసియేషన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధికి సహకరించిన సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. కొత్త భవనం ద్వారా కాలనీ ప్రజలకు సమావేశాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు మంచి వేదిక లభిస్తుందని సభ్యులు తెలిపారు.



## మాజీ ఏమ్మెల్యే పుట్టినరోజు వేడుకల్లో హంగామా

**కేసులు నమోదు చేసిన పోలీసులు**

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలపై ఫైర్ క్రాకర్లు అమర్చి కాల్చి ప్రజా ఆస్తులకు నష్టం కలిగించే విధంగా ప్రవర్తించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రవీణ్, వెంకటేష్, భాస్కర్ గౌడ్‌లపై చర్యలు తీసుకున్నారు. అలాగే అదే జన్మదిన వేడులకల సందర్భంగా రోడ్డును దిగ్బంధం చేసి ప్రజా రవాణాకు అంతరాయం కలిగించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన విష్ణు, నరసింహ, శ్రీశైలం, భాస్కర్ గౌడ్, తిమ్మాజీపేట పాండు, ఇంద్రకల్ రమణ తదితరులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. గోవర్ధన్ తెలిపారు.

# లోక్ అదాలత్‌లలో రికార్డు స్థాయిలో కేసుల పరిష్కారం

**- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ లోక్‌అదాలత్ విజయవంతమైందని, గతంలో ఎన్న డూ లేని విధంగా భారీ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయని ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3195 కేసులు పరిష్కారం కాగా, వాటిలో ముఖ్యంగా 441 ఎఫ్ ఐ ఆర్ కేసులు, 2694 డీడీ కేసులు, 60 ఈ–పెట్టి కేసులు పరిష్కరించబడ్డాయని వివరించారు. సబ్–డివిజన్ల వారీగా చూస్తే, తాండూరు సబ్–డివిజన్ అత్యధికంగా 1686 కేసులను పరిష్కరించి ప్రథమ స్థానంలో నిలవగా, పరిగి సబ్–డివిజన్ 846 కేసులు, వికారాబాద్ సబ్–డివిజన్ 631 కేసులను పరిష్కరించాయని ఎస్పీ వివరించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి, పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించి వేగవంతమైన న్యాయం అందించాలని కోరారు. కేసుల పరిష్కారాని కి కృషి చేసిన అదనపు ఎస్పీ బి. రాములునాయక్, డీసీఆర్బి డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందిని అభినందించారు.

## 1718 కేసుల పరిష్కారం

**ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ తెలిపారు. మొత్తం 1718 కేసులు రాజీ మార్గంలో పరిష్కారమయ్యాయని వెల్లడించారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించిన కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 310, ఈపెట్టి కేసులు 870, డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు 499, సైబర్ క్రైమ్ కేసులు 39 ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ కేసుల్లో రూ. 8,25,319 రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. రాజీ మార్గం ద్వారా ఇరు వర్గాలకు త్వరితగతిన న్యాయం జరుగుతుందని, ఈ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. అలాగే లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

## 750 కిలోల నల్లబెల్లం పట్టివేత



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూలు:** కొల్లాపూర్‌లో ఎక్సైజ్ శాఖ అధికారులు 750 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. లింగాల మండలం వైపు తరలిస్తున్న సమయంలో ట్రాక్టర్ (టీఎస్ 31 2290) ను ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈ ఘటనకు సంబంధించి పెద్దకొత్తపల్లి మండలం యాపట్ల తాండకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బి. నాగిరెడ్డి వెల్లడించారు. దాడిలో ఎస్సై మురళి, కానిస్టేబుల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్‌పై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** రాష్ట్రంలోని నిర్మల్‌లో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సంతోష్ రాజుపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వాసవి యువసేన నాయకులు డిమాండ్ చేశారు.ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వాసవి యువసేన అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్, గౌరవ అధ్యక్షుడు డీవీ నారాయణ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న డాక్టర్‌పై దాడి చేయడం, దుర్భాషలాడడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.దుండగులు రాజకీయ ముసుగులో అరాచకాలు సృష్టిస్తూ, ప్రభుత్వం తమ చేతుల్లో ఉందని వ్యాఖ్యానించడం అనర్థమని మండిపడ్డారు. వైద్యుడిపై దాడి ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి బిల్లకంటి నందు, మలిపెద్ది చంద్రశేఖర్, భాను ప్రకాష్, కిషోర్, సంతోష్, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.పై కూడా కేసులలు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ కె. గోవర్ధన్ తెలిపారు.

# రోడ్డు పనుల్లో నిర్లక్ష్యంపై రాస్తారోకో

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** ధారూర్ మండలంలోని కెరెల్లి గ్రామంలో రహదారి పనుల నిర్లక్ష్యంపై గ్రామస్థులు ఆగ్రహంతో మెరుపు ధర్నాకు దిగారు. తాండూరు–హైదరాబాద్ రోడ్డుపై సుమారు గంటసేపు వాహనాలను నిలిపివేయడంతో ప్రయాణికులు, ముఖ్యంగా వృద్ధులు, ఆసుపత్రికి వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు నెలల క్రితం సీసీ రోడ్డు నిర్మాణం పేరుతో తవ్విన రహదారి ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో గ్రామం మొత్తం దుమ్ముతో కప్పుకుపోయింది. రోజూ భారీ వాహనాల రాకపోకల వల్ల ఎగిసిపడుతున్న దుమ్ము ఇళ్లలోకి, పాఠశాలలలోకి



చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. ముఖ్యంగా చిన్నారులు శ్వాసకోశ సమస్యలు, అలర్జీలు, జలుబు వంటి అనారోగ్యాలతో బాధపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము ప్రభావంతో పంటల పెరుగుదల కూడా దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. పలుమార్లు సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో గ్రామస్థులు రోడ్డెక్కాల్సి వచ్చిందని తెలిపారు. సమాచారం అందుకున్న ధారూర్ ఎస్ఐ రాఘవేందర్ ఘటనాస్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామసులు ధర్నాను విరమించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి పనులను పూర్తి చేసి, గ్రామాన్ని దుమ్ము సమస్య నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## క్యాన్సర్ అంటే భయం వద్దు



**ముద్ర, తాండూర్ :**

క్యాన్సర్ వ్యాధి అంటే భయపడాల్సిన పనిలేదని, ముందస్తుగా గుర్తిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, కిమ్స్ ఆసుపత్రి క్యాన్సర్ నిపుణులు డా. మధు దేవర శెట్టి అన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని సాయి తరుణ్ ఆసుపత్రిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షులు డా. జయప్రసాద్ ఆధ్వర్యంలో, కిమ్స్ ఆసుపత్రి సంయుక్తంగా ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. డీఎస్పీ, వైద్యులతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 350 మందికి పైగా వివిధ పరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 14 మంది వైద్యులు సేవలు అందిం చారు.150 మందికి పైగా రక్తపరీక్షలు, 63 మందికి అల్ట్రాసౌండ్ స్కానింగ్, 12 మందికి మమోగ్రఫీ, 8 మందికి ఎండోస్కోపీ, 69 మందికి ఎక్స్‌రే, 63 మందికి క్యాన్సర్ ప్రత్యేక పరీక్షలు, 53 మందికి పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు.

## 118 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు




**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి పరిధిలో ట్రాఫిక్ పోలీసులు వీకెండ్ సందర్భంగా ప్రత్యేకంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి 118 మందిపై కేసులు నమోదు చేశారు. 96 ద్విచక్ర వాహనాలు, 4 మూడు చక్రాల వాహనాలు, 18 నాలుగు చక్రాల వాహనాలు నడుపుతూ పట్టుపడ్డట్లు పోలీసులు తెలిపారు. వారందరినీ న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ఒక తీవ్రమైన నేరమని మల్కాజ్గిరి పోలీసులు హెచ్చరించారు. గత వారం 22 నుంచి 28 వరకు మొత్తం 492 డ్రంకెన్ డ్రైవ్ కేసులు కోర్టుల్లో విచారణకు వచ్చాయని, వాటిలో30 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష7 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవ, 455 మందికి జరిమానా మాత్రమే విధించబడినట్లు తెలిపారు.

# పాల ఉత్పత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**తెలంగాణ రైతు సంఘం డిమాండ్**

**ముద్ర, గద్వాల:** పాలు ఉత్పత్తి చేసే పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం నాయకుడు ఏ వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీరెల్లి రూట్లో పాల ఉత్పత్తి దారుల రైతులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విజయ డెయిరీ ద్వారా ప్రభుత్వమే పాడి రైతుల నుండి పాలను సేకరించాలని, వారానికోసారి నగదును రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల నుండి పాలను దిగుమతి చేసుకోవడం ద్వారా, అప్పులు చేసి డెయిరీలను నిర్వహిస్తున్న స్థానిక పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత



దానాను సరఫరా చేయాలని, ఆవులు, గేదెలను ప్రభుత్వమే సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలను అందించి ప్రోత్సాహం అందించాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా పాల ఉత్పత్తి పెరిగి,నిరుద్యోగం తగ్గి పాల కల్తీని కూడా నిరోధించడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం 17 మందితో జోగులాంబ గద్వాల జిల్లా పాల ఉత్పత్తిదారుల (సొసైటీ) సంఘం ఏర్పాటు చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఏ వెంకటస్వామి, అధ్యక్షుడిగా మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెద్ద పరుషరాముడు, కోశాధికారిగా రఘు,ఉపాధ్యక్షులుగా గడ్డం శీను,బోజేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా వీరేష్, నీలం నరసింహ, ప్రచార కార్యదర్శులుగా పాల నరేష్, వీరేష్ యాదవ్, సలహాదారులుగా రవీందర్ నాయుడు, సుధాకర్, కమిటీ సభ్యులుగా చెన్నారెడ్డి, లక్ష్మన్న, పరుశరాముడు, మహబూబ్, సందీప్ గౌడ్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, పాడి రైతులు ఎన్. శ్రీధర్, రంగస్వామి, రామకృష్ణ, శ్రీహరి, నర్సింహ , నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దాడిచేసిన వారిపై చర్యలేవీ..?



**ముద్ర, తాండూరు:** తాండూరు పట్టణంలో కౌన్సిలర్ రాము రజక సంఘం నాయకులపై దాడి చేసి ఐదు రోజులు గడిచిన పోలీసులు చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. దోబీ ఘాట్ కు చెందిన 70 గుంటల స్థలంలో కాంగ్రెస్ కౌన్సిలర్ రాము సీసీ రోడ్డు వేస్తామని చెప్పి అక్రమంగా కూల్చారని జిల్లా రజక సంఘం అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. ఈ స్థలాన్ని అభివృద్ధి పనుల పేరిట కబ్జా చేసేందుకే కౌన్సిలర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రహరీని ఎందుకు కూల్చావని ప్రశ్నించినందుకే అకారణంగా దాడి చేశారన్నారు. ఐదు రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్న పోలీసులు పట్టించుకోవడంలేదని రజక సంఘం నాయకులు, జిల్లా సిఐటియు నాయకులు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 30.03.2026
www.mudranews.in | @mudranews



**టీడీపీ రూ. 2 కిలో బియ్యం:**




పేదరిక నిర్మూలన కోసం ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన 'రెండు రూపాయలకే కిలో బియ్యం' పథకం దేశవ్యాప్తంగా పెను మార్పులకు నాంది పలి కింది. ఈ పథకం ఇప్ప టికీ అనేక సంక్షేమ పథకాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

# నియోజకవర్గాల పెంపు కలిసొచ్చేదెవరికి?

**- కరీంనగర్ రాజకీయ చదరంగం..**

**ముద్ర, కరీంనగర్:** కేంద్రం ఇటీవల నియోజకవర్గాల పునర్విభజనకు అనుమతి ఇచ్చింది. జనాభా ఆధారంగా పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు రావడంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల్లో 50 శాతం పెంచాలని ప్రతిపాదించింది. దీంతో తెలంగాణలో ప్రస్తతం 119 స్థానాలు ఉండగా కొత్తగా 60 అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. ఉమ్మడి జిల్లాల వారీగా 5 స్థానాలు పెరగబోతున్నాయి. దీంతో కరీంనగర్ జిల్లా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే సరిహద్దులు మారిపోవడం ఖాయం. దశాబ్దాలుగా ఒకే నియోజకవర్గంలో పట్టు సాధించిన నాయకులకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు కొత్త నియోజకవర్గాలు ఏర్పడితే తమ సామాజిక సమీకరణాలు కలిసొస్తాయని, తమ రాజకీయ కల నెరవేరుతుందని ద్వితీయ శ్రేణి నేతలు ఆశపడుతున్నారు. ఈ చదరంగంలో ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అనేది ఆసక్తికర అంశంగా మారింది.




**ప్రస్తుత పరిస్థితి..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రస్తుతం 13 అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు, ఒక పార్లమెంటు స్థానాన్ని కలిగి ఉంది. ఈ నియోజకవర్గాల్లో కొన్ని దశాబ్దాలుగా ఒకే పార్టీ లేదా ఒకే కుటుంబం ఆధీనంలో ఉన్నాయి. సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి పనుల ఆధారంగా ఓటర్లు నిర్ణయం తీసుకుంటున్నారు. కానీ నియోజకవర్గాల పెంపు జరిగితే ఈ సమీకరణాలన్నీ మారిపోయే అవకాశం ఉంది.

**సీనియర్లకు నష్టం..**

నియోజకవర్గాల పునర్విభజనతో దశాబ్దాలుగా ఒకే నియోజకవర్గంలో పట్టు సాధించిన సీనియర్ నేతలకు నియోజకవర్గాల పునర్విభజన పెద్ద తలనొప్పిగా మారింది. పట్టు ఉన్న ప్రాంతాలు వేరు నియోజకవర్గాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. వారికి మద్దతుగా ఉన్న ఓటు బ్యాంకు రెండు లేదా మూడు నియోజకవర్గాలుగా విభజించబడే అవకాశం ఉంది. కొత్త నియోజకవర్గాల్లో కొత్త నేతలు పోటీకి దిగే అవకాశం ఉంది.

**కొత్తవారికి ఛాన్స్..**

నియోజకవర్గాల పెంపు ద్వితీయ శ్రేణి నేతలకు, యువకులకు అవకాశంగా మారింది. కొత్త నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశం వస్తుంది. తమ సామా జికవర్గం ఆధిక్యం ఉన్న ప్రాంతాలు కొత్త ని యోజకవర్గంగా ఏర్పడితే గెలుపు అవ కా శాలు పెరుగుతాయి. పార్టీలు కూడా కొత్త వారికి అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాయి.

**పార్టీల వ్యూహాలు..**

రాజకీయ పార్టీలకు నియోజకవర్గాల పెంపు వ్యూహాత్మక అవకాశంగా మారింది. తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను కలిపి, కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. విభజన వల్ల అధికార పార్టీ ఓటు బ్యాంకు చీలి, తమకు లాభం చేకూరుతుందని ఆశిస్తుంది. కొత్త నియోజకవర్గాల్లో తమ ప్రాబల్యం చూపించే అవకాశం లభిస్తుంది.

**సామాజిక సమీకరణాల మార్పు..**

కరీంనగర్ జిల్లాలో వివిధ సామాజిక వర్గాలు (రెడ్డి, వెలమ, బ్రాహ్మణ, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ) ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఈ సమీకరణాలు మారిపోతాయి. కొత్త నియోజకవర్గాల్లో ఒకే సామాజిక వర్గం ఆధిక్యం ఏర్పడితే, ఆ వర్గం నేతకు అవకాశం లభిస్తుంది. వివిధ వర్గాలు సమానంగా ఉన్న నియోజక వర్గాల్లో పోటీ మరింత తీవ్రంగా మారుతుంది. ఒకే సామాజిక వర్గం ఆధిక్యం లేనప్పుడు, వివిధ వర్గాల కూటమి అభ్యర్థి గెలుపు నిర్ణయిస్తుంది.

**రాబోయే రోజుల్లో ఏం జరగొచ్చు?**

నియోజకవర్గాల పెంపు ఖాయమైతే, పార్టీలో పలు టికెట్ ఆకాంక్షలు పెరుగుతాయి. సీనియర్ నేతలు, యువ నేతల మధ్య ఘర్షణ తప్పదు. టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారే అవకాశం ఉంది. ఒకే పార్టీ గెలవడం కష్టమైన నియోజకవర్గాల్లో, కూటమి రాజకీయాలు చాలా ముఖ్యమవుతాయి. వివిధ సామాజిక వర్గాల నేతలతో కూటమి ఏర్పా టు చేసుకుని, గెలుపును సాధించే ప్రయ త్నం జరుగుతుంది. కొత్త నియోజకవర్గాల్లో ప్రచార వ్యూహాలు మారాల్సి ఉంటుంది. సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారం మరిం త ముఖ్యమవుతుంది. స్థానిక సమస్యలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

నియోజకవర్గాల పెంపు కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో పెద్ద మార్పును తీసుకురాబోతోంది. దశాబ్దాలుగా పట్టు సాధించిన సీనియర్ నేతలకు ఇది సవాలుగా మారితే, యువ నేతలకు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలకు ఇది సువర్ణావకాశంగా మారింది.

## 6 న బాసరకు సీఎం రాక

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏప్రిల్ 6 న బాసరకు రానున్నట్లు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. బాసర లో మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు ఆలయ పునర్నిర్మాణానికి ముధోల్ లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

## జగిత్యాల క్లబ్ సెక్రెటరీగా రాము

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**



జగిత్యాల క్లబ్ సెక్రెటరీగా పులి రాము ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రెటరీగా జగదీష్, ట్రెజ రీగా పేరాల వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ సెక్రెటరీగా శశికాంత్ రెడ్డి, ఎంసీ మెం బర్లుగా సంజయ్ స్రామాట్, గంగారెడ్డి, అనంత రెడ్డి, వెంకటరమణ, తాడేపు వెంక టర మ ణ, రఘు, నర్సింగరావు ఎన్నికయ్యారు.

## పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కోరారు. పట్టణంలోని 6వ వార్డులో రూ.10 లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల పట్టణం శరవేగంగా విస్తరిస్తోందన్నారు. జగిత్యాలలో శివారు ప్రాంతాలు కలపడంతో అభివృద్ధిని విస్తరిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు ఇంటి నిర్మాణం సమయంలో రోడ్డు వెడల్పు గా ఉండే విధంగా లే అవుట్ పాటించాలని సూచించారు. అలాగే పట్టణాన్ని సర్వాంగ సుందరంగా ఉంచుకునేందుకు ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను తడి, పొడిగా వేరుగా ఇవ్వాలన్నారు. అన్ని విధాలుగా పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, కౌన్సిలర్ చీటి లక్ష్మీనారాయణ, మాజీ వైస్ చైర్మన్ మన్సూర్, సురేందర్ రావు, క్యాదసు నాగయ్య, కొలగని మధు, డీో ఆనంద్, ఏఈ అనిల్, కౌన్సిలర్ లు, నాయకులు పాల్గొన్నారు.



## సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నేటి సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ వంటి సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని జిల్లా న్యాయమూర్తి శ్రీవాణి పిలుపునిచ్చారు. స్థానిక దివ్య గార్డెన్ లో ఆదివారం జరిగిన వశిష్ట డిగ్రీ కళాశాల రజతోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా నిర్మల్ పురపాలక సంఘం చైర్ పర్సన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీవాణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ కలిగిన వ్యక్తిత్వం, నైతిక విలువలు, నిరంతర శ్రమతో సాధన చేస్తే ఏ రంగంలోనైనా రాణించడం సులువవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు గర్వపడేలా చదువుపై దృష్టి నిలిపి ఉన్నత స్థాయిలో నిలబడాలని కోరారు. నేటి యువతలో కొందరు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతూ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలని కోరారు. ప్రతి విద్యార్థి సామాజిక దృక్పథం, దేశ భక్తిని పెంపొందించుకొని దేశంలో మంచి పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి. సత్యనారాయణ గౌడ్, కరస్పాండెంట్ ఎన్.ఆర్. సరోత్తమ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అఖిలేష్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పట్టణంలోని సోఫీ నగర్ లో ఎస్టీ బాలికలపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర నేత రావుల రాం నాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అత్యాచార బాధిత బాలికల కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో హిందువులపై జరుగుతున్న వరుస దాడులు, అత్యాచారాలు సర్వ సాధారణంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో బంద్ కొనసాగుతుండగానే సోఫీ నగర్ లో కొందరు మైనార్టీ వర్గానికి చెందిన దుండగులు బాలికలపై అత్యాచారానికి పాల్పడటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. నిందితులకు కఠిన శిక్ష పడే విధంగా ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండేలా నిందితులను శిక్షించాలని బీజేపీ నాయకులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. రోజురోజుకు జరుగుతున్న ఈలాంటి పరిణామాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, బీజేపీ పట్టణ నాయకులు రాజు తో పాటు హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించాలి



**బోథ్, ముద్ర:** ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ సూచించారు. ఆదివారం ఆయన నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును నేరుగా లబ్ధిదారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు ఇళ్లు నిర్మిస్తుందన్నారు. ఇళ్ల నిర్మాణం త్వరిత గతిన పూర్తి కావడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన నివాసం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి అర్హుడికి ఇల్లు అందేలా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా కళాశ్రీ ఉగాది పురస్కారాలు



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్స్ లో ఆదివారం కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర కళాశ్రీ ఉగాది పురస్కారాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన విశిష్ట ప్రతిభావంతులైన ప్రముఖులకు కళాశ్రీ ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. యూ ట్యూబ్ ఫేం కోడి శ్రీను, రూప, పోషవ్వ హస్యవల్లరి, మల్లేష్ ఒగ్గు కథ, గాయకులు అభి, దేవేందర్, కృష్ణవేణి వంగ పాటల విభావరి ప్రేక్షకులను అలరించింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అయిత అనిత, రుద్రాంగి గోపాల కృష్ణ, సూర్యం, ఎ. వి.ఎన్ రాజు, సంకోజి వెంకట రమణ, మద్దెల సరోజన, ఉజగిరి జమున, లక్కరాజు శ్రీ లక్ష్మీ, కటుకం కవిత, ఓదెల గాంగధర్, పెండెం మహేందర్, గుండేటి బేబి రాణి, బోగ ఉమా రాణి, బుర్ర శ్యామల, గెటప్ శ్రీను, శ్రీరామోజ్ సంగీత, సింగం పద్మ, సవిత కంకటి, ముత్యపు భాగ్యలక్షి , రచన, మద్దెల ప్రభాకర్, అమర్ నాథ్ రెడ్డి, ఆనంద రావు, కందుకూరి నాగరాజు, బుసారపు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ లోని గురుద్వారాలో ఆదివారం లయన్స్ క్లబ్ వారియర్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. వారియర్స్ క్లబ్ అధ్యక్షుడు సుమిత్ కుమార్ జునేజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గురుద్వారా అధ్యక్షుడు గుర్దీప్ సింగ్ తో పాటు సర్దార్ పప్పి, అజిత్ సింగ్, విక్రమ్ సింగ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** స్థానిక ఎస్ ఆర్ ప్రైమ్ పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ చర్మ వ్యాధులు, కాస్మోటాలజీ నిపుణులు డాక్టర్ అమరేశ్వర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ శృతి వాస ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులు, డిజిటల్ స్క్రీన్‌ల వాడకం వల్ల పిల్లల్లో తలెత్తుతున్న చర్మ, కంటి సమస్యలను గుర్తించి వారికి తగిన చికిత్స చేశారు. చిన్నతనం నుంచే సరైన ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను దూరం పెట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల జోనల్ ఇంచార్జి నగేష్, శిరీష, పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ పాల్గొన్నారు.

## నాగరికత నేర్పిందే హిందూ మతం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రపంచంలో అతి పురాతనమైంది హిందూ మతమని, నాగరికతకు పట్టుకొమ్మ అని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. పట్టణంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో మొట్ట మొదటి మతం హిందూ మతమని చరిత్ర చెబుతుందన్నారు. నాటి నుంచి నేటివరకు హిందూ మతాన్ని ఎవరూ ఏం చేయలేకపోయారన్నారు. మన ధర్మమే మనకు రక్షణగా ఉంటుందని తెలిపారు.

## కాంగ్రెస్ నాయకుడికి సన్మానం



**మహదేవపురం, ముద్ర:** మండల కేంద్రంలో ఆదివారం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వామన్ రావు చేస్తున్న సామాజిక సేవలకు గాను ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు హాజరయ్యారు. ఈ సర్పంచ్ హసీనాబాను అధ్యక్షత వహిం చారు. మాజీ ఎంపీపీ రాణిబాయి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు సత్య నారాయణ, బేంబిరి దేవరావు, ఆనకారి ప్రభాకర్ నిర్వహించారు. మాజీ దేవస్థానం చైర్మన్ గుడాల శ్రీనివాస్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆకురు విక్రమ్ సింగ్, తస్సలు చేనేత సంఘం అధ్యక్షులు గొర్రె బాపు, రిటైర్డ్ ఎంఈఓ అడపా రాజయ్య, ఉప సర్పంచ్ శ్రీజ, ఏఎంసీ డైరెక్టర్ ఇర్షాద్, ఎలికేశ్వర మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, విద్యావేత్తలు ఎంఎం శశి, చీర్ల శ్రీనివాస్ రెడ్డి, పూర్వ యువజన నాయకులు ఎండి బాబొద్దీన్ లు పాల్గొనగా, పుర ప్రముఖులు పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 30-03-2026
www.mudranews.in | @mudranews



టీడీపీ మహిళా సాధికారత
ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పించిన ఘనత టీడీపీదే. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి వారిని రాజకీయాల్లో భాగస్వాములను చేసింది.




అంగరంగ వైభవంగా

## శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కళ్యాణోత్సవం

- వైభవంగా తిరువీధి ఉత్సవం

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఏకాదశి పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు నవ కలుశ పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. తోమాల సేవ మేల్ చాట్ వస్త్ర సేవలో పట్టు వస్త్రములు సమర్పించారు. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనం, సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో ఆదివారం సుమారు 5000 మందికి పైగా భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం శ్రీ వేంకటేశ్వర స్వామిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో



మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.

అనంతరం శ్రీవేంకటేశ్వర స్వామి దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించగా భక్తులు నయనానందకరంగా శ్రీవారిని దర్శించుకున్నారు.


మూసీ నీరు బదులుగా

## గోదావరి జలాలను అందించాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ్మ

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

మూసీ విషపు జలాల నుండి పోచంపల్లి ప్రాంత ప్రజలను, రైతులను విముక్తి కల్పించి గోదావరి జలాలను అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండ మడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోచంపల్లి పట్టణ పరిధిలోని నారాయణగిరిలో ఆదివారం ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ పోచంపల్లి ప్రాంతం మూసీ విషపు జలాలతో భూములు మొత్తం ధ్వంసమై ఎలాంటి పంటలు పండకుండా ఎడారిగా మారే ప్రమాదం ఉన్నదని ఆవేదన వెలిబుచ్చారు. కొండ



పోచమ్మ ప్రాజెక్టు నుండి శామీర్ పేట చెరువులోకి గోదావరి జలాలు తెచ్చి అక్కడి నుంచి ఘట్కేసర్ మండలం ఏదులబాద్ చెరువు ద్వారా మూసీ కాలువలోకి గోదావరి జలాలు మళ్లించి పోచంపల్లి ప్రాంతంలోని రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మాజీ డివిజన్ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, మాజీ జిల్లా కమిటీ సభ్యులు పగిళ్ల లింగారెడ్డి, టౌన్ కార్యదర్శి దుబ్బాక జగన్, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, శాఖ కార్యదర్శి గూడూరు రాంరెడ్డి, టౌన్ కమిటీ సభ్యులు వడ్డెపల్లి యాదగిరి, నాయకులు గూడూరు క్రిష్ణా రెడ్డి, సామల సత్తిరెడ్డి, రామస్వామి అంజిరెడ్డి పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు నిర్వహించాలి

- గౌడ జనహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుల్లపల్లి వెంకటేష్ గౌడ్

ముద్ర ప్రతినిధి, భువనగిరి:



తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఏప్రిల్ 2న జిల్లా వ్యాప్తంగా ఊరూరా, వాడవాడలా ఘనంగా నిర్వహించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జిల్లా అధ్యక్షుడు గుల్లపల్లి వెంకటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్య క్రూర పాలనకు, జమీందార్ల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన మహానుభావుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. 1650లో ఖిలాషాపూర్ గ్రామంలో సామాన్య గౌడ కుటుంబంలో జన్మించిన ఆయన, అణగారిన వర్గాలను ఏకం చేసి మొఘల్ సైన్యాన్ని గడగడలాడించారని గుర్తు చేశారు. దళితులు, వెనుకబడిన వర్గాలతో సైన్యాన్ని ఏర్పాటు చేసి, గెరిల్లా యుద్ధం ద్వారా మొఘలులకు ప్రధాన శత్రువుగా మారారు. ఖిలాషాపూర్, తాడికొండ, భువనగిరి వంటి చోట్ల కోటలు నిర్మించి సార్వభౌమాధికారాన్ని చాటారు. 1708లో వరంగల్ కోటను ఆక్రమించి విజయ పతాకం ఎగురవేశారు. ఆలయాల ధ్వంసాన్ని అడ్డుకుంటూ, మహిళల గౌరవాన్ని కాపాడుతూ 'అపర శివాజీ'గా, 'హిందూ ధర్మ పరిరక్షకుడు'గా ప్రజల హృదయాల్లో నిలిచారు. తెలంగాణ ప్రభుత్వం పాపన్న గౌడ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఏప్రిల్ 2న ప్రతి గ్రామంలో గౌడ కుల బాంధవులు, బహుజనులు ఐక్యంగా పాల్గొని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని కోరారు. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన బాటలో నడవడమే పాపన్న గౌడ్‌కు మనం ఇచ్చే నిజమైన గౌరవమని వెంకటేష్ గౌడ్ అన్నారు.

## ఏప్రిల్ 5 నుంచి మెగా టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నీ

ముద్ర, ఖమ్మం:

జిల్లాలోని మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు గ్రామంలో ఏప్రిల్ 5 నుంచి స్థానిక పిల్లిబోస్ గ్రౌండ్ లో ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో అంతర్ రాష్ట్రీయ మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్ ఇషా తీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి క్రికెట్ క్రీడాకారులు, క్రీడా అభిమానులు ఈ టోర్నమెంట్ లో పాల్గొనాలని కోరారు.



ఈ టోర్నమెంట్ లో ప్రాతినిథ్యం వహించేందుకు గాను ఎంట్రీలు పంపవలసిన ఆఖరి తేదీ ఏప్రిల్ 3 కాగా అదే రోజు సాయంత్రం 6 గంటల లోపు ఎంట్రీ ఫీజు రూ.1,000 చెల్లించి నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

టోర్నమెంట్ లో విజేతలకు మొదటి బహుమానంగా రూ.75 వేలు, రన్నరప్ కు రూ.50 వేలు ఇవ్వడంతో పాటు సెమీ ఫైనల్ కు చేరుకునే ప్రతీ జట్టుకు రూ.10 వేలు బహుమతిగా అందజేస్తామని వెల్లడించారు. ఆత్మ కమిటీ డైరెక్టర్ (మీనవోలు) స్థల దాత పిల్లిబోస్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు ప్రకటిస్తూ.. రిజిస్ట్రేషన్ సమయంలో పూర్తి నిబంధనల గురించి వివరిస్తామని పేర్కొన్నారు.

పూర్తి వివరాలకు సెల్ నం. 99129 4641, 90635 31748, 90108 28 776, 79959 45346 లను సంప్రదించాలని సూచించారు.

## కొనసాగుతున్న కొనుగోలు కేంద్రం పనులు

- పడమటి సోమారంలో పనులు పరిశీలించిన పింగళ్ రెడ్డి, శ్యామ్ గౌడ్

బీబీనగర్, ముద్ర:

బీబీనగర్ మండలం పడమటి సోమారం గ్రామంలో రైతు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో ఏర్పాటు కానున్న ఈ రైతు కొనుగోలు కేంద్రం భవన నిర్మాణానికి స్థానిక రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భూమిని చదును చేశారు. యంత్రాలను తీసుకొచ్చి నేలను భవన నిర్మాణానికి అనుకూలంగా తయారు చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగల్ రెడ్డి, పొట్టోల శ్యామ్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురకంటి సత్తి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్



మెట్టు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, మాజీ జడ్పీటీసీ సందిగారి బస్వయ్య, గడ్డం బాల్ రెడ్డి, వాకిటి సంజీవ రెడ్డి, సర్పంచ్ బద్దం అంజయ్య, ఉపసర్పంచ్ తంతరపల్లి ప్రదీప్ గౌడ్, రైతు సంఘం చైర్మన్ ఎర్రబోతు శ్రీనివాస్, ఆల్వ రామకృష్ణా రెడ్డి, బొమ్మగోని బస్వయ్య గౌడ్, ఆల్వ మోహన్ రెడ్డి, కుంభం భాస్కర్ గౌడ్, ఆలేటి రామ్ కొండల్, ఆల్వ ఆనంత రెడ్డి, బద్దం బిక్షపతి, ఆల్వ లింగా రెడ్డి, కుంభం సుభాష్, బలరాం, కిషోర్ రెడ్డి, కుదుస్, ఉస్మాన్ తో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు. పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి స్థానిక రైతులు ధన్యవాదాలు తెలిపారు.

### కొడుకుతో కలిసి కాలువలో దూకి తల్లి ఆత్మహత్య

ముద్ర, వరంగల్:

ఓ తల్లి తన మూడేళ్ల కొడుకును చున్నీతో ముడేసుకుని కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ హృదయ విదారక ఘటన వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మండలం ఇల్లంద లో జరిగింది. కళ్యాణి(24) అనే వివాహిత తన కొడుకు శ్రేయాన్ష్(3)తో సహా ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లీకొడుకు కాలువలోకి దూకిన సమయంలో అందులో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. సమాచారమందుకున్న అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో అధికారులు దాదాపు 7 గంటలు గాలింపు చర్యలు చేపట్టి తల్లీకొడుకు మృతదేహాలను వెలికి తీశారు. వరకట్న వేధింపులే ఈ దారుణానికి కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరి పట్టివేత




ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం:

గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను వన్ టౌన్ పోలీసులు సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఆదినారాయణ వివరాలను వెల్లడించారు. కాశీలో టూరిస్ట్ గైడ్‌గా పని చేస్తున్న ముత్యం రాము యాదవ్(27), శివాలయం ఘాట్ కాశీలో టాటూ వర్కర్ రామకృష్ణ పవన్(25) గంజాయికి అలవాటుపడ్డారు. వారిద్దరూ ఒడిశా సరిహద్దుల్లో గంజాయి తక్కువ ధరకు లభిస్తుందని తెలుసుకొని, అక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 18న హైదరాబాద్‌కి చేరుకున్నారు. అక్కడ బైక్ అద్దెకు తీసుకొని 22న సీలేరుకు చేరుకున్నారు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి 5 ప్యాకెట్ల ఎండు గంజాయిని రూ.28వేలకు కొనుగోలు చేశారు. అనంతరం హైదరాబాద్‌కు వస్తుండగా పాత కొత్తగూడెంలో వన్ టౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకు న్నారు. వారి వద్ద నుంచి 9.980 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని డీఎస్పీ వివరించారు.

### భువనగిరి మున్సిపల్ పరిధిలో కుక్కల పట్టివేత



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

భువనగిరి మున్సిపల్ పరిధిలో కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు భువనగిరి మున్సిపాలిటీ అన్ని వార్డులలో కుక్కలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుక్కలు ఎక్కువగా గుంపులు ఉన్నచో వాట్సప్ ద్వారా కౌన్సిలర్లకు, మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.

### ఎలక్ట్రిక్ బస్సులో మంటలు

ముద్ర, వరంగల్:

హనుమకొండలోని ఆర్టీసీ డిపోలో పార్కు చేసి ఉన్న ఎలక్ట్రిక్ బస్సులో తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సగానికి పైగా బస్సు దగ్ధమైంది.

### రోడ్డు ప్రమాదంలో చిన్నారులకు గాయాలు

ముద్ర, ఖమ్మం:

ఆటో పల్టీ కొట్టడంతో ఆరుగురు చిన్నారులు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం కారేపల్లి మండలంలోని జమలపల్లి సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. పేరుపల్లికి చెందిన వజ్జా సునీల్ అదే గ్రామానికి చెందిన ఆరుగురు పిల్లలను తన ఆటోలో ఎక్కించుకొని ఊరికి వెళ్తున్నారు. మార్గమధ్యలో ఆటో పల్టీ కొట్టడంతో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా, మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు



ముద్ర, మోత్కూర్:

రైతులు పండించిన వరి ధాన్యాన్ని విక్రయించేందుకు సహకార సంఘాలు, ఐకేపీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించే దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మోత్కూర్ లో విలేకరులతో మాట్లాడుతూ వరికోతలు ప్రారంభమైనప్పటికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో కాలయాపన చేస్తుండటంతో ప్రైవేటు వ్యాపారులు వే బ్రిడ్జిలను ఏర్పాటు చేసుకొని కారుచౌకగా దాన్యాన్ని కొనుగోలు చేసెందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రైతులు వారి చేతిలో దోపిడీకి గురికాకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధరకు దాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి తోడు నకిలీ విత్తనాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నకిలి విత్తనాలు విక్రయించే కంపెనీలు, డీలర్లపై పీడీయాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు

### ఇంజ నర్సయ్య ఫౌండేషన్ ఆర్థిక సాయం



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కాల్వపల్లి గ్రామంలోని వట్టిపల్లి రాములమ్మ, గుండేటీ సుభద్ర, బిల్ల లావణ్యలు మృతి చెందారు. నిరుపేద కుటుంబాలు కావడంతో ఇంజ నర్సయ్య ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, వార్డు సభ్యులు పాలకవర్గం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పద్మశాలి సంఘం, కురుమ సంఘం, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### ఓసీ-2లో ప్రమాదం.. ఒకరి మృతి

ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియా ఓసి–2లో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. బిహార్‌కు చెందిన సర్ఫరాజ్ ప్రైవేట్ ఓబీ కంపెనీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం కంపెనీకి చెందిన డంపర్ టైర్లకు మరమ్మతులు చేసేందుకు సర్ఫరాజ్‌తో పాటు శ్యామ్ లాల్, మదుకర్, జగదీష్ కుష్వల్, తాజన్ సావి అక్కడకు చేరుకొని పనులు చేపట్టారు. ఈ క్రమంలో టైర్ ఒక్కసారిగా పేలింది. ఈ ప్రమాదంలో సర్ఫరాజ్‌కు టైర్ బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్రంగా గాయపడ్డారు. శ్యామ్ లాల్‌ను మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు. మరో ముగ్గురికి సింగరేణి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
30.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టీడీపీ హైటెక్ సిటీ - ఐటీ విప్లవం:**

నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చారు. హైటెక్ సిటీ నిర్మాణం మరియు సాఫ్ట్‌వేర్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రపథాన నిలపడంలో ఆయన కృషి అనన్యసామాన్యం.



## వనదుర్గమ్మకు కలెక్టర్ ప్రతిమా పూజలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఏడుపాయల వన దుర్గా మాతను కలెక్టర్ ప్రతిమా సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వీరేశం, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోనే ఏడుపాయల వన దుర్గా మాత ఆలయం చాలా ప్రత్యేకమని పేర్కొన్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతూ ఈ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు. ఆదివారం, సెలవు దినాల్లో అధిక సంఖ్యలో భక్తులు తాకిడికనుగుణంగా సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా భక్తులకు సౌకర్యాలు ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రతంగా ఉంచడంలో నిర్వాహకుల సేవలను కలెక్టర్ కొనియాడారు.
ఈ కార్యక్రమంలో ఈవో వీరేశం సిబ్బంది శ్రీనివాస్, అర్చకులున్నారు.



## కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థుల ప్రతిభ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబరచారని కరాటే మాస్టర్ దినాకర్ తెలిపారు. మెదక్ లో రాష్ట్రస్థాయి కరాటే పోటీల ను రెంజుకి షోతోకన్ కరాటే, నగేష్ మాస్టర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలకు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మెదక్ పట్టణానికి మొత్తం 114 పాయింట్స్ తో చాంపియన్గా నిలిచారు. మెదక్ పట్టణ కేంద్ర విద్యార్థులు దక్షిక, సహస్ర, సాయిశమీక్ష, అనన్య, జయశ్రీ, సాన్విక, విలసిని, బాయ్స్ విభాగంలో విహాన్, ఈశ్వర్ చంద్ర, నాగాక్షిత్, కృతిక్, కౌషిక్, శ్రీయస్, శివాన్స్, త్రీజల్, రానవీర్, సాయి చరణ్, విహాన్ లు 20 గోల్డ్ మెడల్స్ సాధించారు.

## జోగిపేటలో ప్రారంభమైన అఖండ ప్రేమ జ్యోతి

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**



సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా అఖండ ప్రేమ జ్యోతి కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. స్వామి వారి దివ్య సన్నిధి ప్రశాంతి నిలయం పుట్టపర్తి నుండి బయలుదేరిన దివ్య అఖండ ప్రేమ జ్యోతి తెలంగాణ రాష్ట్ర రాష్ట్రమంతటా పర్యటించి సంగారెడ్డి జిల్లాలో ప్రవేశించింది. పటాన్ చెరువు నుండి ఆదివారం ఉదయం ఉదయం 09 గంటలకు జోగిపేట మధ్య రంగం నుండి పూర్ణకుంభం, వేద పఠణముతో మందిరానికి చేరుకుంది. అనంతరం నూతన జ్యోతి ప్రకాశ అనంతరం మంగళ హారతి దివ్య దర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



## టీడీపీకి పూర్వ వైభవం తేవాలి

- **సిద్దిపేట నియోజకవర్గ ఇన్-చార్జ్ పాశి కంటి సత్యం**


**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

టిడిపి పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిద్దిపేట నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జ్ పాశికంటి సత్యం పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కాంచిట్ చౌరస్తా వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో టిడిపి పార్టీ ఏ దశలో ఉందో తెలంగాణ రాష్ట్రంలో కూడా పూర్వ వైభవం తేవడానికి కార్యకర్తలు పని చేసే సమయం ఆసన్నమైంది అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునే పార్టీ తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసే టిడిపి పార్టీని ప్రజలందరూ ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, ఎండి గౌస్ మియా, మల్లేశం సతీష్ గౌడ్ యాదగిరి సత్యనారాయణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రైతులు జీవనాధారాన్ని కోల్పోతారు..

- **ట్రిబుల్ అర్ అలైన్మెంట్, అసైన్మెంట్ భూముల స్వాధీనంపై ఆందోళన**
- **మంత్రి దృష్టికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**




సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల రైతుల భూములను ప్రభావితం చేస్తున్న రీజినల్ రింగ్ రోడ్ (ట్రిబుల్ అర్) ప్రాజెక్ట్ ప్రతిపాదిత అలైన్మెంట్‌పై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కీలక లేఖ రాశారు. గిర్మాపూర్, తోగర్పల్లి, అలియాబాద్, మారేపల్లి, రాంపూర్ తండా,మాచేపల్లి, గోటిలగుట్ట తండా, గంగారం, శివన్నగూడెం తండా గ్రామాలకు చెందిన సుమారు 525 ఎకరాల వ్యవసాయ భూములు ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రభావితం అవుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. ఇందులో అధికంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులే ఉన్నారని తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఓ అర్ ఆర్ నుంచి 40 కి.మీ దూరంలో ఉండాల్సిన ట్రిబుల్ అర్ అలైన్మెంట్ ప్రస్తుతం కేవలం 23 కి.మీ దూరంలో ప్రతిపాదించబడటం వల్ల గ్రామాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ భూములే రైతుల ప్రధాన జీవనోపాధి కాగా, సంవత్సరానికి రెండు పంటలు పండే సారవంతమైన భూమిని కోల్పోతే వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా విచారణలో ఎకరానికి రూ.2 కోట్లు పరిహారం ఇస్తామని చెప్పినా అమలు కాలేదని, వాస్తవానికి ఎన్ హెచ్ 65 సమీపంలోని ఈ భూముల మార్కెట్ విలువ ఎకరానికి రూ.6-8 కోట్లు ఉందని రైతులు పేర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల, ప్రభుత్వం మొదట నిర్ణయించిన అలైన్మెంట్‌ను కొనసాగించాలి లేదా ప్రస్తుత అలైన్మెంట్ కొనసాగితే రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధరతో పరిహారం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

**అసైన్మెంట్ భూముల స్వాధీనం ప్రతిపాదనపై ఆందోళన**

ఇదే సమయంలో సంగారెడ్డి నియోజకవర్గంలోని అసైన్మెంట్ భూముల రక్షణపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మరో లేఖ రాశారు.సదాశివపేట మండలం ఆరూర్,కంది మండలం చెరియాల, కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామాల్లోని సుమారు 593.655 ఎకరాల అసైన్మెంట్ భూములు ఎస్సీ ,ఎస్టీ, మైనారిటీ,బీసీ వర్గాలకు చెందినవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ భూముల్లో అధిక భాగం దళితులకు చెందినవిగా ఉండి, అవే వారి ప్రధాన జీవనాధారమని తెలిపారు. ప్రస్తుతం ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కు అప్పగించే ప్రక్రియ గజిట్ నోటిఫికేషన్ ద్వారా వెలువడటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ భూములు 1997లో, 2005లో భూమిలేని నిరుపేదలకు చట్టబద్ధంగా కేటాయించబడినవని గుర్తుచేశారు. ఈ భూములు కోల్పోతే బలహీన వర్గాల జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటుందని, వారి ఆర్థిక స్థితి క్షీణించే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహకు కీలక లేఖ రాశారు. సంగారెడ్డి నియోజకవర్గంలో వైద్య సేవల మెరుగుదల కోసం పలు అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు.

### అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగవంతం చేయడానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రాష్ట్ర మంత్రి వర్గానికి చెందిన పలు శాఖల మంత్రులకు వరుసగా లేఖలు రాసి కీలక నిధుల మంజూరు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మొదటగా, సంగారెడ్డిలో నిర్మాణంలో ఉన్న మినీ హజ్ హౌస్ పూర్తి చేయడానికి అదనంగా రూ.2 కోట్లు మంజూరు చేయాలని మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజరుద్దీన్ కోరారు. ప్రారంభంలో మంజూరైన నిధులు పూర్తిగా వినియోగించినప్పటికీ, పెరిగిన వ్యయాల కారణంగా ఇంకా నిధులు అవసరమని పేర్కొన్నారు. అలాగే, సదాశివపేట మండలంలో నిర్మాణంలో ఉన్న కొత్త ఎంపీపీ భవన నిర్మాణ పనులు పూర్తిచేయడానికి అదనంగా రూ.1 కోటి మంజూరు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మొదటి అంతస్తు స్లాబ్ వరకు మాత్రమే పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా, సంగారెడ్డి నియోజకవర్గంలో రహదారి అభివృద్ధి పనులకు సంబంధించి ఎస్డిఎఫ్, ఎంఆర్ఆర్ నిధులను తిరిగి మంజూరు చేసి విడుదల చేయాలని కూడా కోరారు.27 రహదారి ప్రాజెక్టుల్లో కేవలం 6 మాత్రమే పూర్తవగా, మిగిలినవి రద్దయ్యాయని, అలాగే ఎంఆర్ఆర్ కింద అనేక పనులు పెండింగ్ బిల్లుల కారణంగా నిలిచిపోయాయని వివరించారు. ఈ నేపథ్యంలో, పెండింగ్ బిల్లులు క్లియర్ చేసి రద్దయిన పనులను తిరిగి మంజూరు చేస్తే అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మూడు ప్రధాన అంశాలపై నిధులు మంజూరైతే సంగారెడ్డి నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు, పరిపాలన సేవలు మరియు సామాజిక సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయనీ ఆయన వెల్లడించారు.

# రక్తదానం మరొకరికి ప్రాణదానం

- **నైపుణ్య యూత్ ఆర్గనైజేషన్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**




సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని రామాలయం కల్యాణ మండపంలో నైపుణ్య యూత్ ఆర్గనైజేషన్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా రక్తదాన ప్రాముఖ్యత గురించి సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజు, గ్రామ సర్పంచ్ మహేశ్వరి దేవరాజు మాట్లాడారు. అత్యవసర సమయాల్లో మనం చేసే రక్తదానం ఒక యూనిట్ ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలను కాపాడడమే కాకుండా, దాతకు కూడా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. నిర్దిష్ట వ్యవధిలో రక్తదానం చేయడం శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపరచడంలో సహాయపడుతుందని అన్నారు. రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదానం మనిషి చేయగలిగే అత్యంత గొప్ప సేవ అని వారు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం అనేక ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు వంటి సందర్భాల్లో రక్తం అవసరం అవుతుందని, ఆ అవసరాలను తీర్చడానికి స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, ఐలయ్య, విజయ్ కుమార్, సదానందం, పూస రాజు, సుధాకర్, యం రాజు తదితరులు ఉన్నారు.




## ఐజేయూ జాతీయ మహా సభకు మెదక్ ప్రతినిధి

**ముద్ర ప్రతినిధి మెదక్:**

ఆంధ్రప్రదేశ్ విజయవాడ అమరావతిలో జరిగిన ఐజేయూ 11వ జాతీయ మహాసభలకు మెదక్ జిల్లా ప్రతినిధిగా కమ్మరి శ్రీనివాస్(మిన్పూర్) హాజరయ్యారు. ఈ సభలో ఐజేయూ నూతన జాతీయ అధ్యక్షుడిగా బల్వీందర్ సింగ్ జమ్మూ, ప్రధాన కార్యదర్శిగా డి.సోమసుందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ ఆధ్వర్యంలో శ్రీనివాస్ తదితరులు నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. జర్నలిస్టులకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

## సాయిసిరికి గురుబ్రహ్మ జీవిత సాఫల్య పురస్కారం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ పట్టణానికి చెందిన ప్రధానోపాధ్యాయులు, సినీగీత రచయిత సాయిసిరికి రాష్ట్రస్థాయి గురుబ్రహ్మ ఉగాది జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన సాయిసిరికి మదర్ తెరిసా సామాజిక సేవ సంస్థ విశాఖపట్నం వారు తెలుగు సాంస్కృతిక గీతాలను రాసి తెలుగు భాష సంస్కృతిక వైభవ వారధిగా నిలిచినందుకుగాను 2026 సంవత్సరం గురుబ్రహ్మ ఉగాది జీవిత సాఫల్య పురస్కారాన్ని ఆదివారం హైదరాబాద్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో అందించారు. మదర్ తెరిసా సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీకృష్ణమూర్తి, వివిధ జిల్లాలో చెందిన ప్రముఖులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.




## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

హవేలిఘనపూర్ మండలం జక్కన్న పేట గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.20 లక్షల నిధులతో సిమెంటు రోడ్డు పనులను సర్పంచ్ చామంతుల సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. స్థానిక దేవాలయానికి వెళ్లే మార్గంలో ఈ అభివృద్ధి పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శీల కనకమ్మ, గ్రామ పంచాయతీ సభ్యులు బయికాడి రాజు, శెగ్గరి స్వప్న,బుర్కా యాదగిరి, కోరబోయిన నాగమణి, కోరబోయిన వసంత,మామిండ్ల నర్సింలు, గంట నాగమణి,గ్రామస్తులు పాల్గొన్నారు.



## విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

- **సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**



చిన్నకోదూరు మండలం అల్లిపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయ ప్రాంగణం మొత్తం కలియ తిరిగారు. తరగతి గదిలో విద్యార్థులు ఆప్యాయంగా పలకరించారు. రోజు భోజనం ఎలా ఉంటుంది మెనూ ప్రకారం పెడుతున్నారా రుచిగా ఉంటుందా అని ఆరా తీశారు. మంచి క్రమశిక్షణ అలవాట్లను అలవరచుకోవాలని మంచి నైపుణ్యం కలిగి ఉండాలని ప్రతి సబ్జెక్ట్ పైన పట్టు సాధించాలని సమయం వృధా చేయకూడదని రోజు వ్యాయామం, యోగ ధ్యానం లాంటివి తప్పని సరిగా చేయాలని శారీరక శ్రమ ఉంటేనే మానసికంగా దృఢంగా ఉంటారని ఒక లక్ష్యం పెట్టుకొని ఉన్నతమైన విలువలతో గమ్యాన్ని చేరుకోవడానికి నిరంతరం శ్రమించాలని ఆదేశించారు. భోజనం, వసతి లో ఎలాంటి లోటు పాట్లు ఉన్న ఎస్ ఓ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**



జోగిపేట మున్సిపాలిటీ 12వ వార్డులోని రంగంపేట లక్ష్మి ఆదివారం చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న జోగిపేట పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, 13వ వార్డు కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ వారి కుటుంబానికి రూ.5 వేలు జోగిపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పట్లూరి శివ శేఖర్ వారి కుటుంబానికి అందజేశారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు వారి వెంట వరుడు వీరేశం, పట్నం విద్యాసాగర్, రంగంపేట పోచయ్య ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
30.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టీడీపీ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర:**
1990లలో నేషనల్ ఫ్రంట్ మరియు యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాల ఏర్పాటులో టీడీపీ కింగ్ మేకర్‌గా వ్యవహరించింది. చంద్రబాబు నాయుడు గారు ఆ కాలంలో జాతీయ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు.

# తల్లిదండ్రుల్ని అనాథలు కానివ్వం

- అమ్మ, నాన్నలకు రక్షణ కల్పించేందుకు కొత్త చట్టం తెచ్చాం
- సీఎం రేవంత్ రెడ్డి
- ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ, మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
సమాజంలో ఏ కుటుంబంలోనూ తల్లిదండ్రులు అనాథలుగా మిగిలిపోకూడదన్న సంకల్పంతోనే ప్రభుత్వం తల్లిదండ్రుల రక్షణ కోసం చట్టం తీసుకొస్తుందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆదివారం శాసనసభలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రవేశపెట్టిన తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ, మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు 2026పై సీఎం మాట్లాడారు. మనిషి బంధాలు, అనుబంధాలను మర్చిపోయి చివరికి పేగు బంధాలను కూడా విస్మరించి, భౌతిక సుఖాలు, ఆర్థిక ప్రయోజనాలు, సంపద కోసం పాకులాటల్లో మునిగిపోయే పరిస్థితులు వచ్చాయని చెప్పారు. తనకు తెలిసిన ఒక ప్రజా ప్రతినిధి తండ్రికి క్యాన్సర్ సోకితే చికిత్స ఇప్పించకుండా నిర్లక్ష్యం వహించారనీ. ఇటీవలే ఆయన మరణించారని సీఎం గుర్తు చేశారు. సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని, సామాజిక బాధ్యతతో తెసుకొచ్చిన ఈ బిల్లుకు అన్ని పక్షాలు ఏకగ్రీవంగా ఆమోదించాలని ముఖ్యమంత్రి సభకు విజ్ఞప్తి చేశారు.

**పిల్లలు, మహిళల భద్రతకు అనేక చట్టాలు..**
దేశంలో పిల్లల సామాజిక భద్రత, మహిళల భద్రత, హక్కులకు రాజ్యాంగ రక్షణతో పాటు, అనేక చట్టాలు ఉన్నాయన్న సీఎం... రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (ఏ) ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత విద్య హక్కు ఉందన్నారు. ఆర్టికల్ 24 ప్రకారం ప్రమాదకర పనుల్లో బాల కార్మికుల నిషేధం ఉందని చెప్పారు. వృద్ధుల సామాజిక భద్రతకు సంబంధించి మన దేశంలో చట్టాలు ఉన్నాయని సీఎం తెలిపారు. పిల్లలు తమ తల్లి దండ్రులను చూసుకోవడం చట్టబద్ధ బాధ్యతగా చేస్తూ "మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007 ఉందని చెప్పారు. పురాణాలలో మాతృ పితృ భక్తికి మారుపేరుగా నిలిచిన శ్రవణ కుమారుడి కథను సీఎం సభలో వివరించారు. ప్రఖ్యాత దుస్తుల వ్యాపారి రేమండ్స్ మాజీ అధినేత, పద్మభూషణ్ అవార్డు గ్రహీత విజయ్ పథ్ సింఘానియా దృష్టాంతాన్ని కూడా సభలో ప్రస్తావించారు.



# నేడు, రేపు భారీ వర్షాలు

- ఉత్తర, పశ్చిమ, మధ్య దక్షిణ తెలంగాణ జిల్లాలో మారనున్న వాతావరణం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
ఎండ వేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు చెప్పింది. సోమవారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బలమైన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో ఉత్తర, పశ్చిమ, మధ్య దక్షిణ తెలంగాణ జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారిపోతుందనీ, హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో వడగండ్ల వాన, బలమైన గాలులు వీచే ప్రమాదముందని వివరించింది. ఈ నేపథ్యంలో అకాల వర్షాలతో పంట నష్టం కలగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. కోత దశలో ఉన్న పంటలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా ఉండేందుకు సరిపడా టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మార్కెట్ యార్డులకు తెచ్చిన ధాన్యాన్ని కూడా కవర్లతో పూర్తిగా కప్పి ఉంచాలని సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సమయంలో రైతులు చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదన్నారు. పశువులను కూడా సురక్షితమైన షెడ్లలో ఉంచాలని సూచించారు. పొలాల్లోని విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లొద్దన్న వ్యవసాయాధికారులు వడగండ్ల వాన, పిడుగులు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పొలాలు వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు.

# బాలికల అపహరణ కేసులో ఇద్దరి అరెస్టు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ పట్టణంలోని సోఫినగర్ ప్రాంతంలో ఇద్దరు బాలికలను అపహరించి, అత్యాచార యత్నం చేసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ ఘటనలో నిందితులు అబ్బాస్ ఖాన్, షేక్ కలీమ్ లను నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు బాలికలను అపహరించి వారిపై అత్యాచార యత్నం చేయడానికి ప్రయత్నించినట్లు నిర్ధారణ కావడంతో నిందితులపై పోక్సో చట్టంతో పాటు బాధిత బాలిక ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కూడా నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటన విడుదల చేస్తూ బాలికలను అపహరించి అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలపై నేరాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లో చేరిక

**ముద్ర కూకట్‌పల్లి :**
కూకట్‌పల్లి నియోజకవర్గంలో వందలాది మంది మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్, మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ భారీ చేరికల కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారికి బండి రమేష్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల కోసం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని కొనియాడారు. అర్హులైన ప్రతి పేద మహిళా కుటుంబానికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని ఆయన స్పష్టం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, నాయకులు లక్ష్మయ్య, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, మహిళా అధ్యక్షురాలు సంధ్య, రజిత పాల్గొన్నారు.

# కన్నవారిని కాదంటే జీతంలో కోత

- తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- ఉద్యోగుల్లో బాధ్యత పెంచే దిశగా ప్రభుత్వం కఠిన నిర్ణయం
- కీలక బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. ఆదివారం శాసనసభలో "తెలంగాణ ఉద్యోగుల జవాబుదారీతనం, తల్లిదండ్రుల సహాయ పర్యవేక్షణ బిల్లు2026"కు ఆమోదం లభించింది. ఎవరైనా ఉద్యోగి తన తల్లిదండ్రులను పట్టించుకోకుండా, వారి కనీస అవసరాలను విస్మరిస్తే, వారి మొత్తం జీతంలో 15 శాతం లేదా రూ. 10,000 (వీటిలో





ఏది తక్కువైతే అది) కట్ చేసి నేరుగా తల్లిదండ్రుల ఖాతాలో జమ చేస్తారు. ఈ బిల్లు కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా.. ప్రభుత్వ రంగ సంస్థలు, గ్రాంట్ ఇన్‌ఎయిడ్ పొందే సంస్థలు, ప్రైవేటు రంగ ఉద్యోగులకు కూడా వర్తిస్తుంది. వీరితో పాటుఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సర్పంచ్‌లు కూడా ఈ చట్టం పరిధిలోకి రావడం విశేషం.

**ఫిర్యాదు ఎవరికి చేయాలి?..**
నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులు నేరుగా జిల్లా స్థాయిలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి (జిల్లా కలెక్టర్)కు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు అందిన 60 రోజుల్లోగా విచారణ పూర్తి చేసి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ జిల్లా స్థాయి అధికారి తీర్పుపై అసంతృప్తి ఉంటే, 'వయోవృద్ధుల కమిషన్'లో అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉంది. మారుతున్న జీవనశైలి కారణంగా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఒంటరివారవుతున్నారని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ చట్టం ద్వారా ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరగడమే కాకుండా, సమాజంలో ఒక మంచి మార్పు వస్తుందని ఆశిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. తల్లిదండ్రుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారికి ఈ బిల్లు ఒక గుణపాఠం అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పసుపు పండుగ



- ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం
- మంగళగిరి ఆఫీసులో భారీ జెండా ఆవిష్కరణ
- వేడుకలను లాంఛనంగా ప్రారంభించిన చంద్రబాబు
- పాల్గొన్న మంత్రి లోకేష్, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్
- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యప్తంగా పార్టీ శ్రేణుల సంబరాలు

**ముద్ర డెస్క్:**
టీడీడీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు టీడీపీ జెండా ఎగురవేశారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ భవన్‌కు టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యకర్తల వద్దకు లోకేశ్ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు.

**ముఖ్య ఘట్టాలతో వీడియో ప్రదర్శన..**
పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు జరిగిన ముఖ్య ఘట్టాలతో వీడియోను ప్రదర్శించారు. ఎన్టీఆర్ బస్సు యాత్ర, విధాన నిర్ణయాలు, ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చిన సంక్షేమ కార్యక్రమాలను అందులో పొందుపరిచారు. పార్టీ కోసం చంద్రబాబు, లోకేశ్ చేసిన కృషితో పాటు యువగళం పాదయాత్రను ప్రస్తావించారు. 201924 మధ్య వైసీపీ హయాంలో రాష్ట్రంలో జరిగిన హింస, దౌర్జన్యాలను వివరించారు. చంద్రబాబు, పార్టీ సీనియర్ నేతలపై పెట్టిన కేసులు, అరెస్టుల తీరు, రాజధాని రైతులపై జరిగిన దాడులను పేర్కొన్నారు. వివేకా హత్య అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.



# మానేరు రివర్ ఫ్రంట్ పనులను వేగవంతం చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ముద్ర, కరీంనగర్:**
మానేరు రివర్ ఫ్రంట్ పనులను వేగవంతం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కరీంనగర్ జిల్లాలోని ప్రతిష్ఠాత్మకమైన మానేరు రివర్ ఫ్రంట్ (MRF) ప్రాజెక్టు పనుల పురోగతిపై అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆదివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతులు, పెండింగ్‌లో ఉన్న నిధులు, ప్రాజెక్టు పూర్తికి ఎదురవుతున్న అడ్డంకులపై మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో జాప్యాన్ని నివారించి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ప్రాజెక్టు గ్రౌండ్ రిపోర్టులపై ఆరా తీశారు. భూసేకరణ ప్రక్రియ, అంచనా వ్యయం (Estimates) వంటి అంశాలపై స్పష్టమైన నివేదికలు ఇవ్వాలని సూచించారు. నీటిపారుదల. పర్యాటక శాఖలకు సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరలోనే మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి మానేరు రివర్ ఫ్రంట్ పనులను స్వయంగా పరిశీలించనున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ నగరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు కీలకమని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్, టూరిజం శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పుష్కరాల నిర్వహణకు ప్రదేశాల గుర్తింపునకు ఇంజనీర్లతో టెక్నికల్ కమిటీ
- 20 రోజుల్లో నివేదిక ఇవ్వాలి
- సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
వచ్చే ఏడాది జూన్‌లో తెలంగాణలో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లన్నీ శరవేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పుష్కరాల కోసం బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఆలయాలు, పుష్కరఘాట్ల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం, ఉన్నతాధికారులతో శాసనసభ సమావేశ హాలులో సీఎం ఆదివారం సమావేశమయ్యారు. 2027 జూన్ గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన పనులపై సమావేశంలో చర్చించారు. అందుకోసం రూపొందించిన ప్రణాళికలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వాటిపై సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించడానికి ఇంజనీర్లతో టెక్నికల్ కమిటీని నియమించాలని ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి వచ్చే 15 లేదా 20 రోజుల్లో నివేదికను సమర్పించాలని చెప్పారు. ఇంజనీర్ల కమిటీ నివేదికను అధికారుల కమిటీ పరిశీలించి, పూర్తి అంచనాలతో నివేదికను రూపొందించి మంత్రివర్గ ఉప సంఘానికి పంపించాలన్నారు. ఉప సంఘం ఆమోదించిన తర్వాత గోదావరి పుష్కరాల సమగ్ర ప్రణాళికపై మంత్రిమండలి తుదినిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పుష్కరాల కోసం శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం తలెత్తకుండా ప్రజా భవన్‌లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ప్రధాన దేవాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో ఘాట్ల నిర్మాణం, విస్తరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలను సందర్శించే భక్తులు, పర్యాటకులకు ఇబ్బందులు రాకుండా ప్రాంతాల మధ్య కనెక్టివిటీ సరిగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి, ఆలయ విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు వివరించగా సీఎం పలు సూచనలు చేశారు. ఈ సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపాల్ సెక్రెటరీలు శేషాద్రి, శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, డీజీపీ శివధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గో సంరక్షణకు ప్రణాళికలు

- సీఎం రేవంత్ రెడ్డి
- పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు, బృందంతో భేటీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణలో గోవుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పక్కా ప్రణాళికలు రూపొందించిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎన్కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో విశాలమైన ప్రదేశంలో గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ముఖ్యమైన ఆలయాల సమీపంలో కూడా గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రముఖ జంతు హక్కుల కార్యకర్త, పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు మేనకా గాంధీ, ఆమె బృందం సీఎం రేవంత్ రెడ్డితో ఆదివారం అసెంబ్లీ సమావేశ హాలులో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ కోసం చేపట్టిన చర్యలను అధికారులు మేనకా గాంధీకి వివరించారు. మున్సిపాలిటీల వ్యాప్తంగా వీధి కుక్కలకు నిర్వహిస్తున్న స్టెరిలైజేషన్ ప్రక్రియ వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జంతువుల సంరక్షణ కోసం తీసుకుంటున్న క్షేత్రస్థాయి చర్యలను అధికారులు మేనకా గాంధీ బృందానికి వివరించారు. జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న చొరవను ఆమె అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ కృషిని ప్రశంసించడంతో పాటు జంతువుల సంక్షేమం పట్ల చూపుతున్న నిబద్ధతను మేనకా గాంధీ కొనియాడారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



**టీడీపీ చైతన్య రథం:**
ఎన్నికల ప్రచారం కోసం ఎన్టీఆర్ ఉపయోగించిన 'చైతన్య రథం' (ఒక వ్యాన్) భారత రాజకీయాల్లో ఒక కొత్త ఒరవడిని తెచ్చింది. గ్రామగ్రామాన తిరుగుతూ ప్రజల మధ్యే ఉండి ప్రచారం చేసే పద్ధతి దీనితోనే ప్రాచుర్యం పొందింది.

# కష్టకాలంలో అండగా నిలిచారు..

- **గల్ఫ్ దేశాల ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు**
- **భారతీయుల రక్షణకు సహకారం**
- **యూఏఈ, సౌదీ, ఖతార్, ఒమన్ సహకారం మరువలేనిది**
- **వేలాది భారతీయుల సురక్షిత తరలింపులో కీలక పాత్ర పోషించిన గల్ఫ్ దేశాలు**
- **దౌత్య సంబంధాల బలం వల్లే విజయవంతమైన రక్షణ చర్యలు**
- **'మన్ కీ బాత్' లో ప్రధాని మోదీ**



**ముద్ర, డెస్క్ :**
పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణంలో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయం అందించిన గల్ఫ్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో భారతీయులకు అండగా నిలిచిన యూఏఈ , సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ దేశాల నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరాన్‌అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు వేలాదిమంది భారతీయులను తమ దేశాల మీదుగా స్వదేశానికి పంపేందుకు గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిదన్నారు. ఈ సంక్షోభ సమయంలో దుబాయ్, అబుదాబీ, మస్కట్ విమానాశ్రయాలు భారతీయుల తరలింపునకు కీలక కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా ఇరాన్ నుంచి భారతీయులను ఒమన్ మీదుగా తీసుకొచ్చేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయడం వారి సహకారానికి నిదర్శనమన్నారు. గల్ఫ్ దేశాలతో భారత్‌కు ఉన్న బలమైన దౌత్య సంబంధాల వల్లే ఎలాంటి ఆటంకాలు లేకుండా వేలాది మందిని సురక్షితంగా తీసుకురాగలిగామని అన్నారు. కష్టకాలంలో ఆదుకున్న గల్ఫ్ దేశాల నాయకులకు భారత్ ఎప్పటికీ రుణపడి ఉంటుందని ప్రధాని అన్నారు. అదేవిధంగా గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ కార్మికులు, వారి కుటుంబాల భద్రతను పర్యవేక్షిస్తున్న ఆయా దేశాల ప్రభుత్వాలకు కూడా ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.



# శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరించాలి

- **చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

**ముద్ర, శేరిలింగంపల్లి:**
శిక్షణ తరగతులు ప్రతి కార్యకర్తకు మార్గదర్శకమని, ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశం ఆచరణలో పెట్టాల్సిన అవసరముందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు. భారతీయ జనతా పార్టీ సంస్థాగత పర్వంలో భాగంగా మాతృశ్రీ నగర్ వద్ద గల కాలేజీలో నిర్వహించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణా మాహాభియన్ 2026 ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీజేపీ పార్టీ సిద్ధాంతాలు, దేశ చరిత్ర, నాయకత్వ లక్షణాలు, సమాజ సేవలో ఎలా ముందుకు సాగాలో తెలుసుకోవచ్చని, మంచి నాయకుడిగా ఎదగాలంటే సరైన శిక్షణ కూడా అవసరమని, కార్యకర్తలకు, నాయకులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇచ్చేది దేశంలో ఒక్క బీజేపీ పార్టీనేనని గుర్తుచేశారు. 14 కోట్ల సభ్యత్వం, 7,60,000 బూత్ కమిటీలు, 17 వేల మండల కమిటీలు, 960 పైగా జిల్లా కమిటీలు, 33 రాష్ట్రాల అధ్యక్షుల నియామకం, కమిటీల నిర్మాణం పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని అని అన్నారు. అందుకు కారణం కార్యకర్తలు మాత్రమేనని, నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజాభివృద్ధి కోసం కృషి చేసే నిబద్ధత గల కార్యకర్తలు బీజేపీ సొంతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్చార్జి రవికుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఇన్చార్జి ఆలె భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, ఇంటెలెక్టువల్ సెల్ కన్వీనర్ బాల్దా అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవరావు నరేష్ యాదవ్, అనిల్ గౌడ్ ఉపాధ్యక్షుడు, రాధాకృష్ణ యాదవ్, స్రవంతి, దుర్గాప్రసాద్, మాణిక్ రావు కృష్ణంరాజు, బుచ్చిరెడ్డి, గోవర్ధన్ గౌడ్, వసంత్ యాదవ్, పద్మ, ఎల్లేష్, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.



# నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**
బిజినపల్లి మండలంలోని నంది వడ్డేమాన్ గ్రామంలో వెలిసిన శ్రీ నందీశ్వర శనేశ్వర స్వామి దేవస్థానంలో 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ వెల్దండ గోపాలరావు, ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి తెలిపారు. మార్చి 31న చైత్ర మాసం త్రయోదశి సందర్భంగా ఉదయం 9 గంటలకు పరమశివునికి విశేష రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన, సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల కళ్యాణోత్సవం, అగ్ని ప్రతిష్ఠ, దీక్ష హోమం జరుగుతాయని తెలిపారు. ఏప్రిల్ 1న శ్రీ జేష్టాదేవి సమేత శనేశ్వర స్వామికి శతకుంభ మహాన్యాస పూర్వక తిలతైల అభిషేకం, శనేశ్వర హవనం, మహా మంగళహారతి నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు శనేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రహోమం జరుగుతాయి. ఏప్రిల్ 2న ఉదయం 10 గంటలకు శ్రీ ఉమామహేశ్వర స్వామి వ్రతం, శాంతి హోమం, బలిహరణ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



అదే రోజు సాయంత్రం 4 గంటలకు నంది వడ్డేమాన్ గ్రామంలో బండ్లు తిరుగుట కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో పాల్గొనే భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం, సాయంత్రం తీర్థప్రసాదాలు కూడా అందజేస్తారు. ప్రత్యేక మహాన్యాస పూర్వక తిలతైల అభిషేక పూజలో ప్రత్యక్షంగా లేదా వర్చువల్‌గా పాల్గొనదలచిన భక్తులు రూ. 258 చెల్లించి, ఫోన్‌పే ద్వారా 94402 31325 లేదా 8186821212 నంబర్లకు పంపి వాట్సాప్ ద్వారా వివరాలు పంపించాలని సూచించారు. ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ శనేశ్వర స్వామి కృపాకటాక్షాలు పొందాలని దేవస్థానం అధికారులు కోరారు.




# డీలిమిటేషన్ ఊహాగానాలతో తుంగతుర్తిలో ఉత్కంఠ

- **తుంగతుర్తి జనరలా, ఎస్సీ రిజర్వ్ గా ఉంటుందా?**
- **జనరలైనా, మహిళా రిజర్వేషన్ అయినా పోటీ తీవ్రంగా ఉండబోతుందా?**
- **బరిలో బీఆర్ఎస్ నుంచి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, కాంగ్రెస్ నుంచి ప్రస్తుత జిల్లా మంత్రి సతీమణి ?**
- **జనరల్ అయితే జిల్లా మంత్రి రంగంలోకి?**

**ముద్ర, తుంగతుర్తి:**
దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరుగుతుందని అటు పార్లమెంటు నియోజక వర్గాలు ఇటు అసెంబ్లీ నియోజక వర్గాలు పెరుగుతాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో ఆశావహుల్లో కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. ముఖ్యంగా నాలుగు పర్యాయాలు ఎస్సీ రిజర్వుడుగా ఉన్న తుంగతుర్తి నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో 9 మండలాల విస్తీర్ణంలో కొనసాగుతోంది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కొనసాగితే ప్రస్తుతం ఉన్న తుంగతుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలు ఒక నియోజకవర్గంగా, ఇతర జిల్లాలో ఉన్న మూడు మండలాలతో కలిపి మరో నియోజకవర్గంగా ఏర్పడుతుందని ఊహాగానాలు నెలకొన్నాయి. ముఖ్యంగా నాలుగు పర్యాయాలు ఎస్సీ రిజర్వుగా ఉన్న తుంగతుర్తి నియోజకవర్గం జనరల్ గా మారుతుందని, కొత్తగా ఏర్పడబోయే మరో నియోజకవర్గం రిజర్వుడుగా ఉంటుందని చర్చించుకుంటున్నారు. ఈ ఊహాగానాలే నిజమైతే తుంగతుర్తి నియోజకవర్గం జనరల్ స్థానంగా మారిన పక్షంలో ఒకవేళ మహిళా రిజర్వేషన్ బిల్లు పాసై పలు నియోజకవర్గాలు మహిళలకు కేటాయించిన పక్షంలో తుంగతుర్తి నియోజకవర్గం మహిళలకు కేటాయిస్తారా..? అనే చర్చ కూడా సాగుతోంది. జనరల్ నియోజకవర్గంగా మారిన పక్షంలో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఆశావహులు బాగానే కనిపిస్తున్నారు. ముఖ్యంగా జిల్లా మంత్రి తన సొంత గ్రామం నియోజకవర్గ పరిధిలోనే ఉందని తుంగతుర్తి జనరల్ స్థానంగా మారినట్లయితే పోటీకి సిద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే సంకేతాలు పంపినట్లు సమాచారం. బీఆర్ఎస్ నుంచి నియోజకవర్గం నాగారం వాసి గుంతకల్లు జగదీశ్ రెడ్డి, అలాగే మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ భర్త గుజ్జ యుగంధర్ రావు పోటీకి సిద్ధపడవచ్చని చర్చించుకుంటున్నారు. మహిళా రిజర్వేషన్ అయినా, మహిళలకు కేటాయించినా ఇప్పటికే ఎమ్మెల్యేగా ఉన్న సదరు మంత్రి సతీమణి తుంగతుర్తి నుండి రంగంలోకి దిగే అవకాశాలు మెండుగా ఉన్నట్లు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జెడ్పీ చైర్మన్ గా ఎలాంటి వివాదాలు లేకుండా కొనసాగిన గుజ్జ దీపికా యుగంధర్ రావు బీఆర్ఎస్ నుంచి బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. జెడ్పీ చైర్మన్ గా కొనసాగిన సమయం నుంచి వీరికి కేసీఆర్, కేటీఆర్ ఆశీస్సులు మెండుగా ఉన్నట్లు చెబుతున్నారు. ఒకవేళ మహిళా రిజర్వేషన్ కాకుండా జనరల్ స్థానం అయితే మాజీ మంత్రి దివంగత నేత రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు ప్రస్తుత ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి బరిలోకి దిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. భారతీయ జనతా పార్టీ నుంచి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చని అంటున్నారు. అలాగే భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సైతం పోటీకి ప్రయత్నించవచ్చని తెలుస్తోంది. మాజీ డీసీసీ అధ్యక్షుడు ప్రస్తుత రైతు కమిషన్ సభ్యుడు, బీసీలలో మంచి పట్టున్న నాయకుడు చెవిటి వెంకన్న యాదవ్ సైతం కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సూర్యాపేట ఎమ్మెల్యేగా ఉన్న గుంతకండ్ల జగదీశ్ రెడ్డి సైతం తుంగతుర్తి మారతారా లేక సూర్యాపేట రెండు నియోజకవర్గాలుగా విడిపోతే ఒకటి జనరల్, ఒకటి రిజర్వుడ్ గా ఉన్న పక్షంలో అక్కడ జనరల్ స్థానంలో పోటీ చేస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. సూర్యాపేట నియోజకవర్గం రెండుగా విడిపోతే జనరల్ స్థానంగా ఉన్న పక్షంలో అక్కడి నుండి పోటీ చేయవచ్చునని తెలుస్తోంది. తుంగతుర్తి నియోజకవర్గం జనరల్ గా మారిన పక్షంలో పోటీ తీవ్రంగా ఉండవచ్చని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు పోటీ పడవచ్చని తెలుస్తోంది. ఏది ఏమైనా తుంగతుర్తి నియోజకవర్గం జనరల్ స్థానంగా మారిన పక్షంలో మహిళా రిజర్వేషన్ అమలవుతుందా..? లేక జనరల్ స్థానంలో ఉంటుందా..? ఎస్సీ రిజర్వుడుగానే ఉంటుందా..? అనేది సైతం ఆశావహులకు కొంత ఉత్కంఠత రేపుతోంది.

# యుద్ధానికి నెలరోజులు..

- **చమురు మంటలతో అల్లాడుతున్న ప్రపంచం**
- **హార్ముజ్ జలసంధి మూతపడటంతో ఆకాశాన్ని తాకుతున్న ధరలు**
- **ఇరాన్-అమెరికా ఘర్షణలు గ్లోబల్ ఎకానమీపై భారీ ప్రభావం**
- **చమురు సంక్షోభంతో ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుల జీవన వ్యయం భారం**
- **భారత్ సహా ప్రపంచ దేశాలు ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వంపై ఆందోళన**

**ముద్ర, డెస్క్ :**
ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణాలను ఒక్కసారిగా కుదిపేసిన పశ్చిమాసియా యుద్ధానికి నేటితో నెలరోజులు పూర్తయ్యాయి. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా ప్రారంభించిన సైనిక దాడులు, ఇరాన్ పై విస్తరించడంతో ఈ ప్రాంతం యుద్ధ మంటల్లో చిక్కుకుంది. ముఖ్యంగా ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి ఈ యుద్ధాన్ని మరింత తీవ్రమయ్యేలా చేసింది.

**చమురు సంక్షోభం – ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై భారీ ప్రభావం**
ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హార్ముజ్ జలసంధి మూతపడటం ఈ సంక్షోభంలో అత్యంత ప్రమాదకర పరిణామంగా మారింది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారానే జరుగుతుంది. దీని ప్రభావంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 107-112 డాలర్ల మధ్య ఊగిసలాడుతున్నాయి. ఇంధన ధరల పెరుగుదల కారణంగా ఆసియా, ఐరోపా దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగి ప్రజలపై భారీ భారం పడుతోంది. రవాణా ఖర్చులు పెరగడం, పరిశ్రమల ఉత్పత్తి వ్యయం అధికమవడం వల్ల ఆర్థిక వ్యవస్థలు ఒత్తిడికి గురవుతున్నాయి.



**యుద్ధ వ్యూహాలు – అధునాతన ఆయుధాల వినియోగం**
అమెరికా అత్యాధునిక బీ-21 రైడర్ బాంబర్లు, ఇజ్రాయెల్ ఎఫ్-35 యుద్ధ విమానాలు ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేయడంతో మిత్రదేశాలు వైమానిక ఆధిపత్యం సాధించాయి. అనంతరం టెహ్రాన్, మషద్ వంటి కీలక కేంద్రాలపై దాడులు కొనసాగించాయి. దీనికి ప్రతిగా ఇరాన్ తమ ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ద్వారా గెరిల్లా యుద్ధ విధానాన్ని అవలంబించింది. డ్రోన్లు, యాంటీ షిప్ క్షిపణులతో అంతర్జాతీయ నౌకాయానాన్ని అడ్డుకుంటూ ప్రపంచ సరఫరా గొలుసును దెబ్బ తీస్తోంది.

**అంతర్గత పరిస్థితులు**
కొత్త సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేనీ నియామకం దేశంలో మిశ్రమ ప్రతిస్పందనకు దారితీసింది. ఒకవైపు ప్రజల్లో దేశభక్తి పెరిగినప్పటికీ, మరోవైపు అణచివేత చర్యలు కొనసాగుతున్నాయి. విదేశీ దాడుల నేపథ్యంలో ప్రజలు తాత్కాలికంగా ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్నారు.

**భారత్‌పై ప్రభావం**
ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు వినియోగదారుగా ఉన్న భారత్ ఈ సంక్షోభంతో తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఇంధన ధరలు పెరగడం వల్ల దేశీయ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగింది. గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయుల భద్రత కూడా ప్రధాన సమస్యగా మారింది. అంతేకాకుండా చాబహార్ పోర్టు ప్రాజెక్టు భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. ఇది భారత్‌కు వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాజెక్టు.

**దౌత్య ప్రయత్నాలు – ఫలితం లేకుండా నిలిచిన చర్చలు**
ఒమన్, స్విట్జర్లాండ్ మధ్యవర్తిత్వంలో జరుగుతున్న శాంతి చర్చలు ఇప్పటివరకు ఎటూ తేలలేదు. అమెరికా ప్రతిపాదించిన "15 పాయింట్ల ప్రణాళిక"ను ఇరాన్ తిరస్కరించడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది.

**భవిష్యత్తు – అనిశ్చితి మబ్బులు**
ప్రస్తుతం పరిస్థితులను పరిశీలిస్తే పశ్చిమాసియాలో త్వరలో శాంతి నెలకొనే అవకాశాలు కనిపించడం లేదు. సౌదీ అరేబియా, ఈజిప్ట్ వంటి దేశాలు రక్షణ చర్యలు పెంచుతున్నాయి. ఈ యుద్ధం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలోకి వెళ్లే అవకాశం ఉంది. ముఖ్యంగా చమురు ధరల మంటలు సామాన్య ప్రజల జీవన వ్యయాన్ని మరింత పెంచడం ఖాయం. యుద్ధం ప్రారంభమై నెలరోజులు గడిచినా పరిష్కారం కనబడకపోవడం ప్రపంచానికి ఆందోళన కలిగిస్తోంది. చమురు, ఆర్థిక వ్యవస్థ, ఆహార భద్రత మూడింటిపై ఈ సంక్షోభం తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో శాంతి చర్చలు విజయవంతమవ్వడం మాత్రమే ప్రపంచానికి ఉపశమనం ఇవ్వగల మార్గంగా కనిపిస్తోంది.

# తెలుగు వర్సిటీలో బోనాల సందడి

- **'ప్రేమాక్షరి' వేదికపై జానపద కళాకారుల పూనకాలు**

**ముద్ర, కూకట్‌పల్లి :**
పొగడ్తలు, డప్పుల మోతలు, శివసత్తుల పూనకాలతో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియం మారుమోగింది. 'ప్రేమాక్షరి' పుస్తకావిష్కరణ సభలో లలిత కళా పీఠం ఫోక్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రదర్శించిన బోనాల జాతర ప్రదర్శన ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. సాంబ్రాణీ పొగ, కల్లు సాకలు, పోతరాజుల విన్యాసాలతో వేదికపైనే పల్లెటూరి జాతరను సాక్షాత్కరింపజేశారు. "రావే రావే పెద్దమ్మా..", "మమ్ము చల్లగా చూడే ఎల్లమ్మ" అంటూ విద్యార్థులు పాడిన పాటలు, చేసిన నృత్యాలు ఆడిటోరియంలో భక్తిభావాన్ని నింపాయి. బోనాల ప్రదర్శనతో పాటు చివరగా విద్యార్థులు ప్రదర్శించిన లంబాడీ డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ తన జీవితంలో అత్యంత శ్రద్ధగా వీక్షించిన ప్రదర్శన ఇదని విద్యార్థులను కొనియాడారు. నేటి తరం విద్యార్థుల్లో కూడా కళల పట్ల గొప్ప శ్రద్ధాశక్తులు ఉన్నాయని, దానికి ఈ ప్రదర్శనే నిదర్శనమని ఆయన ప్రశంసించారు. సీనియర్ సంపాదకులు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ కళ అనేది సమాజానికి మంచి చెడులను వివరించే గొప్ప కమ్యూనికేషన్ సాధనం అని అన్నారు. పీఠాధిపతి డాక్టర్ విజయ్‌పాల్ పర్యవేక్షణలో విద్యార్థులకు అందుతున్న శిక్షణను ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, డీన్ ఆచార్య బి.హెచ్. పద్మప్రియ, వివిధ విభాగాల అధిపతులు, జర్నలిజం అధ్యాపకులు డాక్టర్ షేక్ హసీనా, షమీర్, వెంకటేశ్వర్లు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.




**టీడీపీ అభివృద్ధి - సంక్షేమం:**
ఒకవైపు జన్మభూమి వంటి కార్యక్రమాల ద్వారా అభివృద్ధిని, మరోవైపు పెన్షన్లు మరియు డ్వాక్రా సంఘాల ద్వారా సంక్షేమాన్ని సమతుల్యం చేయడం ఈ పార్టీ ప్రత్యేకత.





## కలెక్టర్ కావాలనుకున్న కుర్రాడు

- **ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అభినందన్ సింగ్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

అభినందన్ సింగ్ ప్రస్తుతం భారత క్రికెట్ సర్కిల్‌లో చర్చనీయాంశంగా మారాడు. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం వరకు అతని గురించి పెద్దగా తెలియని పరిస్థితి ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున 29 ఏళ్ల అభినందన్ సింగ్ అరంగేట్రం చేశాడు. తొలి మ్యాచ్‌లో బౌలర్‌గా పెద్దగా ప్రభావం చూపకపోయినా.. డేంజరస్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌ను ఔట్ చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. దీంతో ఈ ఆర్‌సీబీ నయా పేసర్ టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారాడు. ఎలాంటి దేశవాళీ క్రికెట్ టోర్నీలు ఆడకుండా నేరుగా ఐపీఎల్ ఆడిన క్రికెటర్‌గా గుర్తింపు పొందిన అభినందన్ సింగ్ గురించి తెలుసుకోవడానికి నెటిజన్లు ఆసక్తి చూపిస్తున్నారు.

**కలెక్టర్ కావాలనే లక్ష్యంతో..**

అభినందన్ సింగ్ క్రికెట్ ప్రయాణం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. కలెక్టర్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ యువకుడు.. పరిస్థితుల కారణంగా క్రికెటర్‌గా ఎదిగాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌కు చెందిన అభినందన్ సింగ్.. యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఢిల్లీ వెళ్లాడు. అతని తండ్రి సాధారణ రైతు కావడంతో ఖర్చుల కోసం ఢిల్లీలో ప్రైవేట్ ట్యూషన్లు చెప్పేవాడు. ఒకవైపు కోచింగ్ తీసుకుంటూ.. మరోవైపు తనకు ఇష్టమైన క్రికెట్ ఆడేవాడు. పగలు క్రికెట్ ప్రాక్టీస్ చేస్తూ.. రాత్రిపూట చదువుకునేవాడు. మొదట టెన్నిస్ బాల్‌తో సరదాగా ఆడిన అభినందన్ సింగ్.. తర్వాత ఢిల్లీలోని మద్రాస్ క్లబ్‌లో శిక్షణ పొందాడు. టెన్నిస్ బాల్‌తో మెరుగైన ప్రదర్శన చేయడంతో అతనికి మద్రాస్ క్రికెట్ క్లబ్ నుంచి అవకాశం లభించింది. ఆ క్లబ్ తరఫున సత్తా చాటడంతో యూపీ టీ20 లీగ్ 2024, 2025 సీజన్లలో లక్నో ఫాల్కన్స్ తరఫున ఆడే అవకాశం దక్కింది.

## క్లాసెన్ క్యాచ్ ఔట్ వివాదం.. థర్డ్ అంపైర్‌పై గవాస్కర్ విమర్శలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ క్యాచ్ ఔట్‌పై సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగుతోంది. థర్డ్ అంపైర్ నిర్ణయంపై సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని కోణాల్లో పరిశీలించకుండా త్వరగా నిర్ణయం ప్రకటించాల్సిన అవసరం ఏంటని మండిపడుతున్నారు.

కొందరు మాజీ క్రికెటర్లు కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబట్టారు. భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ కూడా థర్డ్ అంపైర్ తీరుపై విమర్శలు చేశారు. ఇంకాస్త సమయం తీసుకుని నిర్ణయం ప్రకటించాల్సిందని అభిప్రాయపడ్డారు.


**కాస్త సమయం తీసుకోవాల్సింది..**

'థర్డ్ అంపైర్ మరికాస్త సమయం తీసుకుంటే బాగుండేది. సమీక్షించేందుకు తొందర ఎందుకు? ఫిల్ సాల్ట్ బౌండరీ లైన్‌ను టచ్ చేసినట్లు కొందరికి అనిపించింది. ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి. బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద బ్యాటర్‌కు అవకాశం ఇవ్వాలి. అందుకే ఈ నిర్ణయం సరిగా అనిపించలేదు' అని సునీల్ గవాస్కర్ వ్యాఖ్యానించారు. రొమారియో షెఫర్డ్ వేసిన 14వ ఓవర్‌లో క్లాసెన్ ఇచ్చిన కష్టతరమైన క్యాచ్‌ను డీప్ మిడ్‌వికెట్ బౌండరీ లైన్ వద్ద ఫిల్ సాల్ట్ అందుకున్నాడు. ఈ క్రమంలో అతను బౌండరీ రోప్‌పై పడినట్లు కనిపించింది. ఫీల్డ్ అంపైర్ సమీక్ష కోరగా.. పలు మార్లు రిప్లేలను పరిశీలించిన థర్డ్ అంపైర్ క్లాసెన్‌ను క్యాచ్ ఔట్‌గా ప్రకటించారు. అయితే మరో కోణం నుంచి పరిశీలించకుండా నిర్ణయం ప్రకటించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రెండేళ్ల నిషేధం సరిపోదు..**

ఐపీఎల్ నుంచి చివరి నిమిషంలో తప్పుకునే విదేశీ ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీసీఐకి సునీల్ గవాస్కర్ సూచించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న రెండేళ్ల నిషేధం సరిపోదని, ఈ నిబంధనను మరింత కఠినంగా మార్చాలని అభిప్రాయపడ్డారు. 'ఐపీఎల్ నుంచి చివరి నిమిషంలో తప్పుకునే విదేశీ ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇప్పుడున్న రెండేళ్ల నిషేధం సరిపోదు. అది ఎవరిపైనా పెద్దగా ప్రభావం చూపదు. అందుకే బీసీసీఐ మరింత కఠినమైన నిబంధనలు తీసుకురావాలి' అని గవాస్కర్ సూచించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధన ప్రకారం.. ఏ విదేశీ ఆటగాడైనా సరైన అనుమతి లేకుండా వైదొలిగితే రెండేళ్ల నిషేధం విధిస్తారు. కుటుంబ, వైద్య కారణాలు ఉంటే ఆటగాళ్లకు బీసీసీఐ అనుమతి ఇస్తుంది. ఇటీవల బెన్ డకెట్ చివరి నిమిషంలో ఐపీఎల్ నుంచి తప్పుకోవడంతో గవాస్కర్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.







## రెస్టారెంట్‌లో కనిపించిన సిరాజ్..

- **డేటింగ్ రూమర్లకు మళ్లీ ఊపిరి**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

సెలబ్రిటీల డేటింగ్, పెళ్లి, విడిపోవడం వంటి అంశాలు ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే ఉంటాయి. ముఖ్యంగా క్రికెటర్లు, సినిమా సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలు బయటకు వస్తే అవి సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతుంటాయి. టీమిండియా యంగ్ ఫాస్ట్ బౌలర్‌గా గుర్తింపు పొందిన మహమ్మద్ సిరాజ్ స్వల్ప కాలంలోనే జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. అద్భుతమైన బౌలింగ్‌తో అంతర్జాతీయ స్థాయిలో తన సత్తా చాటుకున్నాడు. ఐపీఎల్‌లో కూడా స్థిరంగా రాణిస్తూ జట్టుకు కీలకంగా మారాడు. గతంలో ఒక గాయకురాలి మనవరాలితో సంబంధం ఉందనే వార్తలు వచ్చినప్పటికీ అవి తర్వాత పుకార్లేనని తేలింది. ఇప్పుడు మరోసారి సిరాజ్ వ్యక్తిగత జీవితంపై చర్చ మొదలైంది. మహిరా శర్మతో సిరాజ్ డేటింగ్‌లో ఉన్నట్టు ప్రచారం జోరందుకుంది. అహ్మదాబాద్‌లోని ఓ రెస్టారెంట్‌లో వీరిద్దరూ కలిసి కనిపించినట్టు సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఒకే ప్రాంతంలో వీరిద్దరూ కనిపించడం డేటింగ్ రూమర్లకు మరింత బలం చేకూర్చినట్టు చర్చ జరుగుతోంది. గతంలో కూడా మహిరా శర్మతో సిరాజ్ డేటింగ్ చేస్తున్నట్టు వార్తలు వచ్చినప్పుడు ఆమె స్పందిస్తూ అలాంటి ప్రచారాన్ని ఖండించింది. తాను ఎవరితోనూ సంబంధంలో లేనని పేర్కొంది. అదే సమయంలో సిరాజ్ కూడా Instagram స్టోరీలో నిరాధార వ్యాఖ్యలు చేయవద్దని సూచిస్తూ పోస్ట్ చేశాడు. అనంతరం ఆ పోస్ట్‌ను తొలగించాడు. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత అహ్మదాబాద్‌లో వీరిద్దరూ కనిపించడం రకరకాల వదంతులకు కారణమవుతోంది. ఈ ప్రచారంపై సిరాజ్, మహిరా శర్మ ఎలా స్పందిస్తారన్నది ఆసక్తిగా మారింది.

## అరుదైన ఘనత సాధించిన కోహ్లి..

- **టెస్టులకు తిరిగి రావాలని రాయుడు సూచన**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్‌లోనే విరాట్ కోహ్లి హాఫ్ సెంచరీతో మెరిశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. 202 పరుగుల లక్ష్య ఛేదనలో 69 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ క్రమంలో కోహ్లి అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఛేదనలో 4 వేలకుపైగా పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. అలాగే టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆరో బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఈ సందర్భంగా పాకిస్థాన్ ఆటగాడు షోయబ్ మాలిక్ రికార్డును కోహ్లి అధిగమించాడు. మాలిక్ 557 మ్యాచ్‌ల్లో 13,571 పరుగులు చేయగా.. కోహ్లి 415 మ్యాచ్‌ల్లోనే 13,612 పరుగులు సాధించాడు.

**టెస్టు క్రికెట్‌కు నాయకత్వం వహించాలి: రాయుడు**

టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లి మళ్లీ జట్టులోకి రావాలని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు సూచించాడు. టెస్టు జట్టుకు నాయకత్వం వహించాలని అభిప్రాయపడ్డాడు. సన్‌రైజర్స్‌పై 69 పరుగులతో అజేయంగా నిలిచిన కోహ్లిపై ప్రశంసలు కురిపించాడు.

''ఇప్పుడు మనం చూసింది కేవలం ట్రైలర్ మాత్రమే. ఐపీఎల్‌లో అతడి నుంచి అత్యుత్తమ ఆట ఇంకా రాలేదనే చెబుతా. ఫిట్‌నెస్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేవు. ఇప్పటికీ మైదానంలో చురుగ్గా ఉన్నాడు. అతడి అంతర్జాతీయ కెరీర్ కనీసం ఐదారు సంవత్సరాలు కొనసాగుతుందని అనుకుంటున్నా. టెస్టుల్లోకి పునరాగమనం చేయాలి. కెప్టెన్సీ చేపట్టాలి. భారత క్రికెట్‌లో అతడు అత్యుత్తమ సారథి అని భావిస్తా'' అని రాయుడు విశ్లేషించాడు.



## సెహ్వాగ్–అశ్విన్ సరదా సంభాషణ

- **కామెంట్రీ బాక్స్‌లో నవ్వులు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన తొలి మ్యాచ్ సందర్భంగా టీమిండియా మాజీ క్రికెటర్లు వీరేంద్ర సెహ్వాగ్, రవిచంద్రన్ అశ్విన్ మధ్య సరదా సంభాషణ చోటుచేసుకుంది. ఈ మ్యాచ్‌తో హిందీ కామెంటేటర్‌గా రవిచంద్రన్ అశ్విన్ అరంగేట్రం చేశాడు. కొత్తగా హిందీ కామెంట్రీ ప్యానెల్‌లోకి వచ్చిన అశ్విన్‌కు సీనియర్‌గా సెహ్వాగ్ కొన్ని సూచనలు చేశారు. 'ఈ రోజు మనం లాజిక్, ఆలోచనతో కాకుండా మనసుతో మాట్లాడుదాం' అని సెహ్వాగ్ అన్నాడు. వెంటనే అశ్విన్ స్పందిస్తూ 'మా తల్లిదండ్రులు ఏదైనా మాట్లాడే ముందు ఆలోచించి




మాట్లాడాలని, ఆలోచించకుండా ఏదీ అనకూడదని నేర్పించారు. మీరు మాత్రం దానికి విరుద్ధంగా చెబుతున్నారు' అని అన్నాడు. దానికి సెహ్వాగ్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చి నవ్వులు పూయించాడు. అశ్విన్‌కు యూట్యూబ్ ఛానెల్ ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ 'కొంతమంది కావాలనే ఆలోచించి మాట్లాడుతారు. ఈ ప్లేయర్‌కు ఎక్కువ మంది అభిమానులు ఉన్నారు.. నేను అతని గురించి నెగటివ్‌గా మాట్లాడితే నా ఫాలోవర్లు తగ్గిపోతారు. పాజిటివ్‌గా మాట్లాడితే ఫాలోవర్లు పెరుగుతారు అని భావిస్తారు' అని వ్యాఖ్యానించాడు. దాంతో కామెంట్రీ బాక్స్‌లో నవ్వులు వెల్లువెత్తాయి. ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ సమష్టి ప్రదర్శనతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 201 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ 80 పరుగులతో హాఫ్ సెంచరీ సాధించాడు. అనంతరం ఆర్‌సీబీ 15.4 ఓవర్లలో 4 వికెట్లకు 203 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. దేవదత్ పడిక్కల్ 26 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సలతో 61 పరుగులు చేయగా.. విరాట్ కోహ్లి 38 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సలతో 69 నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

## వాంఖడే పిచ్ ఎలా ఉంది? గెలిచే సత్తా ఉన్నది ఆ జట్టుకే

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్‌లో రెండో మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఐపీఎల్‌లో ఐదు సార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్.. రెండుసార్లు ట్రోఫీ అందుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్ ఆదివారం ముంబై వేదికగా తలపడబోతున్నాయి. రెండు జట్లు బలంగా ఉండటంతో మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతుందని అంచనాలు ఉన్నాయి. ముంబై జట్టుకు హార్దిక్ పాండ్యా నాయకత్వం వహిస్తున్నాడు. కోల్‌కతా జట్టుకు అజింక్య రహానే సారథ్యం వహిస్తున్నాడు. ముంబై జట్టులో రోహిత్ శర్మ, తిలక్ వర్మ, జస్ప్రీత్ బుమ్రా వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు. వీరు గనుక రెచ్చిపోతే ముంబై జట్టుకు తిరుగు ఉండదు. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఫ్లాట్ పిచ్ రూపొందించినట్టు సమాచారం. అదే నిజమైతే పరుగుల వరద పారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఐపీఎల్‌లో ముంబై జట్టు 24 సార్లు కోల్‌కతాపై విజయాలు సాధించగా.. కోల్‌కతా 11 సార్లు మాత్రమే గెలిచింది. మొత్తంగా చూస్తే కోల్‌కతాపై ముంబైకి అప్పర్ హ్యాండ్ కనిపిస్తోంది. ముంబై జట్టులో సూర్యకుమార్ యాదవ్ భీకరమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ టీ20 టోర్నీల్లో అతడు సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. అదే జోరు కోల్‌కతాతో మ్యాచ్‌లో చూపిస్తాడని ముంబై అభిమానులు అంచనా వేస్తున్నారు. కోల్‌కతా జట్టులో ఫిన్ అలెన్, కామెరన్ గ్రీన్, టిమ్ సైఫర్ట్, రొవ్మన్ పావెల్, రఘువంశీ, రమన్‌దీప్ సింగ్ కీలక ఆటగాళ్లుగా కనిపిస్తున్నారు. ముఖ్యంగా గ్రీన్, అలెన్ మంచి ఫామ్‌లో ఉన్నారు. ఇటీవల టీ20 వరల్డ్‌కప్‌లో న్యూజిలాండ్ తరఫున అలెన్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అదే జోరు ముంబైపై కూడా కొనసాగించాలని కోల్‌కతా యాజమాన్యం భావిస్తోంది. పిచ్ ఫ్లాట్‌గా ఉండే అవకాశం ఉండటంతో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. ఒకవేళ బుమ్రా అదనపు బౌన్స్ సాధిస్తే




కోల్‌కతా బ్యాటర్లకు ఇబ్బంది కలగొచ్చు. అయితే ఆ జట్టులోని పలువురు ఆటగాళ్లకు బుమ్రాను ఎదుర్కొన్న అనుభవం ఉండటంతో ఆశావాహ దృక్పథంతో కనిపిస్తున్నారు. టాస్ గెలిచిన జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకునే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే తర్వాత చేజింగ్ చేయడం సులభమవుతుందని అంచనా.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
30.03.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టీడీపీ సుదీర్ఘ నాయకత్వం:**



నారా చంద్రబాబు నాయుడు గారు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడిగా రికార్డు సృష్టించారు. ప్రస్తుతం 44వ వసంతంలోకి అడుగుపెట్టిన టీడీపీ, ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది.

## యాక్షన్‌తో ఆకట్టుకున్న లీడర్ ట్రైలర్

ముద్ర, సినిమా డెస్క్:




లెజెండ్ శరవణన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "లీడర్". ఈ చిత్రాన్ని లెజెండ్ శరవణ స్టోర్స్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. దర్శకుడు ఆర్ ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్‌గా నటిస్తోంది. "లీడర్" సినిమా ఏప్రిల్ 3న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన ఈ చిత్ర టీజర్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా నుంచి యాక్షన్ ట్రైలర్‌ను విడుదల చేశారు. "లీడర్" మూవీ యాక్షన్ ట్రైలర్‌ను పరిశీలిస్తే ట్రైన్‌లో జరిగే భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ప్రారంభమవుతుంది. 'ఈ ప్రపంచంలో ఏ సహాయం దేవుడు నేరుగా చేయడు.. మనుషుల ద్వారా మంచి పనులు జరుగుతాయి.. మనం వాళ్లనే నమ్మాలి' అనే డైలాగ్ కథానాయకుడి ఆలోచనలను తెలియజేస్తుంది. ట్రైన్‌లో, పోర్ట్ ప్రాంతంలో, అడవిలో జరిగే హై వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్ సినిమా నిర్మాణ వైభవాన్ని చూపిస్తున్నాయి. ప్రధాన పాత్రలు, వాటి భావోద్వేగాలను గ్లింప్స్‌లా చూపించారు. భారీ యాక్షన్ సన్నివేశాల్లో హీరో లెజెండ్ శరవణన్ ఆకట్టుకునేలా నటించారు. ట్రైలర్ చివర్లో వచ్చిన తండ్రి-కూతురు భావోద్వేగ సన్నివేశం హృదయానికి హత్తుకునేలా ఉంది. భారీ యాక్షన్, సెంటిమెంట్‌తో పాటు కమర్షియల్ అంశాలతో "లీడర్" సినిమా ప్రేక్షకులను థియేటర్లలో అలరించనున్నట్టు ఈ యాక్షన్ ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది.



## చంద్రశేఖర్ యేలేటి–ప్రదీప్ రంగనాథన్ కాంబో సెట్టు

ముద్ర, సినిమా డెస్క్ :

తెలుగు సినిమా పరిశ్రమలో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న వారిలో చంద్రశేఖర్ యేలేటి ఒకరు. ఆయన చివరిగా 2021లో విడుదలైన 'చెక్' చిత్రానికి దర్శకత్వం వహించారు. నితిన్ హీరోగా వచ్చిన ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. తాజాగా తెలిసిన సమాచారం ప్రకారం, చంద్రశేఖర్ యేలేటి ఓ యంగ్ హీరోతో తన తదుపరి చిత్రాన్ని ఓకే చేసుకున్నాడు. తమిళ నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ మరియు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో ఈ సినిమా రూపొందుతుందని సమాచారం. మరికొన్ని రోజుల్లో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ప్రదీప్ రంగనాథన్ ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నాడు, మరోవైపు చంద్రశేఖర్ యేలేటి సినిమాలు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చే సినిమా మీద అభిమానుల్లో మంచి అంచనాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి.

## ఫొటో షూట్‌లో నికితా శర్మ హాట్ షో



టెలివిజన్ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించిన నటి నికితా శర్మ మరోసారి తన ఫోటో షూట్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సహజమైన నటనతో పాటు గ్లామర్ లుక్‌లతో కూడా అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ బ్యూటీ, తాజాగా షేర్ చేసిన ఫోటోలతో మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది .ఈ ఫోటోల్లో నికితా శర్మ సాఫ్ట్ పాస్టల్ కలర్ డ్రెస్‌లో స్టైలిష్‌గా కనిపిస్తోంది. ప్రశాంతమైన అవుట్‌డోర్ లొకేషన్‌లో తీసిన ఈ ఫోటోల్లో ఆమె లుక్ చాలా ఎలిగెంట్‌గా ఉండటంతో పాటు కొంచెం బోల్డ్ టచ్ కూడా కనిపిస్తోంది. సింపుల్ మేకప్, నేచురల్ హెయిర్ స్టైల్‌తో ఆమె అందం మరింత హైలైట్ అయింది. ప్రతి ఫోటోలోనూ ఆమె ఎక్స్‌ప్రెషన్స్ ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. టెలివిజన్ సీరియల్స్‌తో కెరీర్ ప్రారంభించిన నికితా శర్మ, ఇప్పుడు కొత్త కథలతో ముందుకు సాగాలని చూస్తోంది. డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లలో కూడా అవకాశాలు అన్వేషిస్తున్న ఈ బ్యూటీ, గ్లామర్ ఫోటో షూట్‌లతో ఎప్పటికప్పుడు ట్రెండ్‌లో ఉంటోంది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే నికితా శర్మ, తరచూ తన కొత్త ఫోటో షూట్స్‌ను అభిమానులతో పంచుకుంటూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. ప్రస్తుతం ఆమె తాజా ఫోటోలు నెటిజన్ల నుంచి మంచి స్పందన పొందుతున్నాయి.



## బన్నీ బర్త్‌డేకి అట్లీ మూవీ టీజర్

ముద్ర, సినిమా డెస్క్:

అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ చిత్రం వేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాకు ఇంకా అధికారిక టైటిల్ ఫిక్స్ చేయలేదు. అందువల్ల తాత్కాలికంగా 'AA22xA6' అనే వర్కింగ్ టైటిల్‌తో చిత్రీకరణ కొనసాగుతోంది. సమాచారం ప్రకారం, అల్లు అర్జున్ పుట్టిన రోజు అయిన ఏప్రిల్ 8న టీజర్ రిలీజ్ చేయబోవచ్చని అంచనా. మూవీ బృందం ఇప్పటికే టీజర్ కోసం ప్రత్యేక పనులను ప్రారంభించిందని సమాచారం. యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్ ఈ ప్రాజెక్ట్‌కు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో మ్యూజిక్ ప్రధాన ఆకర్షణగా నిలవాలని సరికొత్త సౌండ్ డిజైన్‌పై ఆయన ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్, అట్లీ కూడా టీజర్‌కు కొత్త తరహా సౌండింగ్ తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. ఈ భారీ చిత్రంలో దీపికా పదుకోనె, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ వంటి స్టార్ హీరోయిన్లు నటించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం. తాజాగా అనుష్క శర్మ కూడా చిత్రంలో భాగమయ్యే అవకాశం ఉందని సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. సన్ పిక్చర్స్ బ్యానర్‌లో కళానిధి మారన్ అత్యంత భారీ బడ్జెట్‌తో సినిమాను నిర్మిస్తున్నారు.

## రా అండ్ రస్టిక్ టోన్‌తో అనకాపల్లి టీజర్

- **సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు సినిమా**

ముద్ర, సినిమా డెస్క్:

భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్లపై రూపొందుతున్న 'అనకాపల్లి' సినిమాకు సంబంధించిన టీజర్ తాజాగా విడుదలైంది. కంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేతో పాటు త్రినాథరావు నక్కిన ఈ చిత్రంలో ఒక ముఖ్య పాత్రలో కూడా కనిపించబోతున్నారు. టీజర్ ప్రారంభం నుంచే మాస్ స్టైల్‌లో సాగుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. బలమైన డైలాగ్‌తో మొదలయ్యే ఈ టీజర్‌లో యాక్షన్ సన్నివేశాలు, రా అండ్ రస్టిక్ విజువల్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. గ్రామీణ నేపథ్యంలో సాగుతున్న కథలో శక్తివంతమైన భావోద్వేగాలు, ఘర్షణాత్మక సన్నివేశాలు ఉండబోతున్నాయనే విషయం టీజర్ చూస్తే స్పష్టంగా తెలుస్తోంది. యాక్షన్‌తో పాటు లవ్ ట్రాక్ కూడా సినిమాలో ముఖ్యమైన భాగంగా ఉండబోతుందని టీజర్ సూచిస్తోంది. యూత్‌కి నచ్చే రొమాన్స్, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కనెక్ట్ అయ్యే ఎమోషనల్ సన్నివేశాలు కూడా ఇందులో ఉంటాయని అర్థమవుతోంది. మాస్ ఆడియెన్స్‌ను టార్గెట్ చేస్తూ తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతుందని చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రానికి మాయా.వి సినిమాటోగ్రఫీ అందించగా, దేవ్ జండ్ సంగీతం సమకూర్చారు. శ్రీకృష్ణ అట్లూరి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. ఉదయ్ భాగవతుల డైలాగ్స్ రాశారు. ఈ సినిమాలో తారక్ పొన్నప్ప, ఇంద్రజ అబ్బర్, మహబూబ్ బాషా, శ్రీనివాస్ వడ్లమాని, నందిని రాయ్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ఈ సమ్మర్‌లో విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు.









## 'మహాకాళి'లో ప్రభాస్ ?

- **ప్రశాంత్ వర్మ యూనివర్స్‌లో సెన్సేషన్ టాక్**

ముద్ర సినిమా డెస్క్ :

'హనుమాన్' సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన దర్శకుడు ప్రశాంత్ వర్మ ఇప్పుడు తన ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో పవర్‌ఫుల్ ప్రాజెక్ట్‌తో రాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక సెన్సేషనల్ వార్త వైరల్ అవుతోంది. ఇందులో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఒక కీలక అతిథి పాత్రలో కనిపించబోతున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది.ఈ చిత్రంలో ప్రభాస్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని, ఆయనకు సంబంధించిన సన్నివేశాల షూటింగ్ కూడా ఇప్పటికే సైలెంట్‌గా పూర్తయ్యిందనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఇదే నిజమైతే వెండితెరపై ప్రభాస్ ఎంట్రీకి థియేటర్లలో భారీ రెస్పాన్స్ రావడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. ప్రశాంత్ వర్మ స్టైల్‌లో ప్రభాస్ ఎలా కనిపిస్తారో చూడాలని ఫ్యాన్స్ ఇప్పటినుంచే ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రశాంత్ వర్మ కథను అందిస్తుండగా, పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. పశ్చిమ బెంగాల్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో కన్నడ బ్యూటీ భూమి శెట్టి టైటిల్ రోల్‌లో కనిపించబోతోంది. అలాగే బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా 'శుక్రాచార్యుడు' పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఆర్‌కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ సూపర్ హీరో చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## వృషకర్మ ఓవర్సీస్ హక్కులు సేల్

ముద్ర సినిమా, డెస్క్:

టాలీవుడ్ యంగ్ హీరో నాగ చైతన్య ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'వృషకర్మ' సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా మూవీ మేకర్స్ ఓవర్సీస్ హక్కులకు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేశారు. విదేశాల్లో ఈ చిత్రాన్ని 'పీహెచ్‌ఎఫ్' మరియు 'ప్రత్యంగిర సినిమాస్' సంస్థలు రిలీజ్ చేస్తాయని మేకర్స్ తెలిపారు.సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించగా, కార్తీక్ దండు దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టడంతో మూవీపై అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పటికే విడుదల తేదీని అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఈ వేసవిలో సినిమాను థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అభిమానులు ప్రస్తుతం సినిమా అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## నిధి.. అందాల విందు

ముద్ర, సినిమాడెస్క్:



టాలీవుడ్ గ్లామర్ హీరోయిన్ నిధి అగర్వాల్ మరోసారి తన ఫోటో షూట్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమాల కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువగా యాక్టివ్‌గా కనిపిస్తున్న ఈ బ్యూటీ, తన గ్లామర్ లుక్‌లతో అభిమానులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూనే ఉంది. తాజాగా ఆమె షేర్ చేసిన బ్లూ కలర్ లుక్ ఫోటోలు నెటిజన్ల నుంచి మంచి స్పందన అందుకుంటున్నాయి.

ఈ కొత్త ఫోటోల్లో నిధి అగర్వాల్ డీప్ రాయల్ బ్లూ చీరలో కనిపిస్తూ అందరినీ ఆకర్షిస్తోంది. మెరిసే ఫ్యాబ్రిక్‌తో ఉన్న ఆ చీరకు అందమైన బోర్డర్ మరింత ఎలిగెంట్ లుక్‌ను తీసుకొచ్చింది. దానికి మ్యాచ్ అయ్యే స్టైలిష్ బ్లౌజ్, బోల్డ్‌గా కనిపించే నెక్ డిజైన్ మొత్తం లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒక వైపు జారిన సాఫ్ట్ హెయిర్ స్టైల్, నేచురల్ మేకప్‌తో ఆమె అందం మరింత హైలైట్ అయింది.

ఫ్యాషన్ ఫోటో షూట్‌లతో ఎప్పటికప్పుడు ట్రెండ్‌లో ఉండే నిధి అగర్వాల్, ఈ బ్లూ చీర లుక్‌తో మరోసారి తన స్టైల్‌ను నిరూపించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిమానులు కూడా ఆమె కొత్త సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com